విశాలాంధ్ర



ఏలూరు, పశ్చిమ గోదావరి
కాకినాడ, కోనసీమ
తూర్పుగోదావరి

గురువారం 12 జూన్ 2025 8 పేజీలు

నాలుగు లేబర్ కోడ్లు రద్దు చేసే వరకు పోరాటం

సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు తాటిపాక మధు

విశాలాంధ్ర - సామర్లకోట : మోదీ చేపడుతున్న ప్రజా కార్మిక వ్యతిరేక విధానాలపై పోరాటం చేస్తామని, మోదీని ఇంటికి పంపించే వరకు కార్మిక లోకం పోరాడుతుందని సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు తాటిపాక మధు తెలిపారు. బుధవారం స్థానిక ఏఐటీయూసీ కార్యాలయంలో సీపీఐ పట్టణ మహాసభ మడకల రమణ అధ్యక్షతన జరిగింది. అంతకుముందు స్థానిక పాత ఎంఆర్‌ఓ కార్యాలయం వద్ద నుండి ర్యాలీగా బయలుదేరారు. అనంతరం పార్టీ పతాకాన్ని సీనియర్ నాయకులు కట్ట సత్యనారాయణ ఎగురవేశారు. గత మూడు సంవత్సరాలుగా మరణించిన పార్టీ కార్యకర్తలు, సానుభూతి పరులకు రెండు నిమిషాలు మౌనం పాటించి నివాళులు అర్పించారు. తాటిపాక మధు మాట్లాడుతూ నిజమైన ప్రజాస్వామ్యాన్ని కాపాడాలంటే సీపీఐ చేపడుతున్న కార్యక్రమాలను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. జులై 15, 16 తేదీలలో జరిగే సీపీఐ జిల్లా మహాసభలను జయప్రదం చేయలని మధు పిలుపు నిచ్చారు. కేంద్రంలో నరేంద్ర మోదీ మూడోసారి అధికారంలోకి వచ్చి పేద, బడుగు, బలహీన వర్గాల, కార్మిక, కర్షక, ఉద్యోగ వ్యతిరేక విధానాలను అవలంబిస్తున్నారని మండిపడ్డారు. దేశ సంపదను తన మిత్రులైన అంబానీ, అదానీ, గుజరాత్ పెట్టుబడిదారులకు దోచిపెడుతున్నారని పేర్కొన్నారు. యువతకు రెండు కోట్ల ఉద్యోగ అవకాశాలు కల్పిస్తానని, నిరుద్యోగ యువతను నరేంద్ర మోదీ మోసం చేశారని మండిపడ్డారు. కార్మికులు పోరాడి సాధించుకున్న హక్కులను కార్పొరేట్ పెట్టుబడిదారులకు దాసోహం అయ్యేలా కార్మిక చట్టాలలో మార్పు చేయడానికి చూస్తుందని వాటిని రద్దు చేసేవరకు కార్మిక సంఘాలన్నీ మరో విప్లవాత్మకమైన పోరాటానికి సిద్ధమై ప్రతిఘటించాలని కోరారు.

సీపీఐ జిల్లా కార్యదర్శి కె. బోడకొండ, సహాయ కార్యదర్శి తోకల ప్రసాద్ మాట్లాడుతూ రైతులకు గిటుబాటు ధరలు కల్పించకుండా రైతుల నడ్డి విరుస్తున్నారని ▶మిగతా 2లో..

ప్రభుత్వ కార్యాలయాలకు సౌర విద్యుత్

రాష్ట్ర వ్యవసాయ శాఖా మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు

విశాలాంధ్ర-ఏలూరు: రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ కార్యాలయాలకు సోలార్ ద్వారా విద్యుత్ సౌకర్యం కల్పించనున్నట్లు రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు చెప్పారు. స్థానిక వ్యవసాయ మార్కెట్ కమిటీ యార్డులో రూ. 35 లక్షలతో ఏర్పాటుచేసిన 50 కిలోవాట్ల సోలార్ రూఫ్ టాప్ సిస్టమ్‌ను బుధవారం మంత్రి అచ్చెన్నాయుడు ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి అచ్చెన్నాయుడు మాట్లాడుతూ సోలార్ ▶మిగతా 2లో..

సురక్షితమైన తాగునీటికి పటిష్ట చర్యలు

కలెక్టర్ చదలవాడ నాగరాణి

విశాలాంధ్ర -భీమవరం: జిల్లాలో ప్రజలకు సురక్షితమైన తాగునీరు అందించేందుకు అధికారులు పటిష్టమైన చర్యలు తీసుకోవాలని, పన్నుల వసూళ్లను పకడ్బందీగా చేపట్టాలని, అనుమతులు లేని లే అవుట్‌లలో నిర్మాణాలకు అనుమ తించరాదని కలెక్టర్ చదలవాడ నాగరాణి అన్నారు. బుధవారం కలెక్టర్ తన క్యాంపు కార్యాలయం నుండి త్రాగునీరు, పన్ను వసూళ్ళ, ▶మిగతా 2లో..

రోగులకు మెరుగైన సేవలు ప్రభుత్వ లక్ష్యం

మంత్రి కందుల దుర్గేష్

విశాలాంధ్ర - నిడదవోలు : రాష్ట్రంలోని పేద రోగులకు ఉచితంగా మెరుగైన వైద్య సేవలు అందించడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక సినిమాటోగ్రఫీ మంత్రి కందుల దుర్గేష్ అన్నారు. బుధవారం తూర్పుగోదావరి జిల్లా నిడదవోలు నియోజకవర్గం ఉండ్రాజవరంలో రూ.50 లక్షల అంచనా వ్యయంతో ఆధునికీకరించిన ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని మంత్రి దుర్గేష్ ప్రారంభించారు. అంతకుముందు పెరవలి మండలం కానూరులో, నిడదవోలు మండలం సమిశ్రగూడెం గ్రామాల్లో పర్యటించిన మంత్రి కందుల దుర్గేష్ స్థానికంగా ఉన్న ప్రాథమిక ఆరోగ్య కేంద్ర భవనాల్లో అదనంగా రూ. 9.83 లక్షల అంచనా వ్యయంతో నిర్మించిన 6 పడకల యూనిట్ లను, ఎమర్జెన్సీ కోవిడ్ రెస్పాన్స్ పాయింట్ లను జిల్లా కలెక్టర్ పి. ప్రశాంతితో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా జాతీయ క్షయ నిర్మూలన కార్యక్రమ పోస్టర్‌ను విడుదల చేసి బాలలచే కేక్ కట్ చేయించారు. ఈ సందర్భంగా మంత్రి కందుల దుర్గేష్ మాట్లాడుతూ నిడదవోలు పట్టణంలోని 30 పడకల ఆస్పత్రిని రాబోయే రోజుల్లో 100 పడకల ఆస్పత్రిగా ఏర్పాటు చేసి తీరుతామని, ఇప్పటికే ఆ దిశగా గట్టి ప్రయత్నం చేస్తున్నామని, అతి త్వరలోనే శంకుస్థాపన చేయనున్నామని మంత్రి కందుల దుర్గేష్ స్పష్టం ▶మిగతా 2లో..

రూ.98 లక్షలతో అభివృద్ధి పనులు

కలెక్టర్ షణ్మోహన్

విశాలాంధ్ర - కాకినాడ రూరల్ : రాష్ట్రంలో నూతన ప్రభుత్వం ఏర్పడి సంవత్సరం పూర్తయిన సందర్భంగా జిల్లాలో ఇప్పటి వరకు చేపట్టిన వివిధ అభివృద్ధి కార్యక్రమాలకు సంబంధించి పూర్తైన పనులను ప్రారంభించు కోవడం, కొత్తగా మంజూరైన వాటికి శంకుస్థాపన చేస్తున్నట్టు జిల్లా కలెక్టర్ షణ్మోహన్ అన్నారు. బుధవారం కాకినాడ రూరల్ నియోజకవర్గం, కాకినాడ రూరల్ మండలం సర్పవరం గ్రామంలో భావన్నారాయణ స్వామి దేవస్థానం నుంచి వాడపల్లి సత్యనారాయణ చేను వరకు, అక్కడ నుంచి సత్తెమ్మ తల్లి గుడి వరకు, తుమ్మలపల్లి అమ్మిరాజు చేను నుంచి జాతీయ రహదారి 216 కాకినాడ బైపాస్ వరకు సీసీ రోడ్డు నిర్మాణానికి రూ.98 లక్షల ఎన్ఆర్ఈజీఎస్ నిధులతో చేపట్టిన పనులకు జిల్లా కలెక్టర్ షణ్మోహన్..కాకినాడ రూరల్ ఎమ్మెల్యే పంతం నానాజీ, ఇతర ప్రజాప్రతినిధులతో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ షణ్మోహన్ మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా సుమారుగా 200 పనులను శాసనసభ్యులు, ఇతర ప్రజాప్రతినిధుల సమక్షంలో పండుగ వాతావరణంలో ప్రారంభోత్సవాలు శంకుస్థాపనలు నిర్వహిస్తున్నామన్నారు. కాకినాడ రూరల్ ఎమ్మెల్యే పంతం నానాజీ మాట్లాడుతూ కాకినాడ రూరల్ నియోజకవర్గంలో గత సంవత్సర కాలంలో సుమారుగా 370 సీసీ రోడ్లు, ఇరిగేషన్ కాలువల పనులు పెద్ద ఎత్తున చేపట్టినట్టు తెలిపారు. రాష్ట్రంలో ఇంతవరకు ఏ ముఖ్యమంత్రి చేయని విధంగా ఆపదలో ఉన్న కుటుంబాలను ఆదుకునేందుకు దరఖాస్తు చేసుకున్న 15 రోజుల్లోనే ముఖ్యమంత్రి సహాయ నిధి (సీఎంఆర్ఎఫ్) కింద ఆర్థిక సహాయం సీఎం చంద్రబాబు నాయుడు అందిస్తున్నారని ఆయన తెలిపారు. కార్యక్రమంలో డ్వామా పీడీ ఎ. వెంకటలక్ష్మి, కాకినాడ ఆర్డీవో ఎస్. మల్లి బాబు, కాకినాడ రూరల్ మండల తహసీల్దార్ ఎస్ఎల్ఎన్ కుమారి, పంచాయతీ రాజ్ ఇంజనీరింగ్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

జనార్ధనవరంలో ఏరువాక

విశాలాంధ్ర-చాట్రాయి: జనార్ధనవరంలో మంత్రి సారధి సాంప్రదాయబద్ధంగా ఏరువాకలో పాల్గొన్నారు. బుధవారం చాట్రాయి మండలం జనార్ధనవరం గ్రామంలో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన ఏరువాక పౌర్ణమి కార్యక్రమంలో మంత్రి సారథి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. పూజా కార్యక్రమాలు అనంతరం విత్తనాలు జల్లి మంత్రి ఎద్దుల నాగలి దున్నారు. కార్యక్రమంలో ▶మిగతా 2లో..

జంగారెడ్డిగూడెంలో అంతర్జాతీయ ఆధ్యాత్మిక శాస్త్రవేత్తల సదస్సు

విశాలాంధ్ర-జంగారెడ్డిగూడెం : పట్టణంలోని శేషాద్రినగర్‌లో శ్రీగౌరి సుభద్ర పిరమిడ్ ధ్యానమందిర అనుబంధ మైత్రేయ మందిరంలో ఈనెల 14,15 తేదీల్లో రెండు రోజులపాటు అంతర్జాతీయ ఆధ్యాత్మిక శాస్త్రవేత్తల సదస్సు నిర్వహిస్తున్నట్టు ది జంగారెడ్డిగూడెం పిరమిడ్ స్పిరిచ్యువల్ ట్రస్ట్ ప్రకటించింది. ప్రపంచశాంతి, ఆధ్యాత్మిక దివ్య చైతన్యం ద్వారా ఆనందం తద్వారా వ్యవస్థ బలోపేతం,వ్యక్తిగత పురోగతి అందరికీ అందించే ఆశయంతో విశ్వవ్యాప్తంగా ఉన్న ఆధ్యాత్మిక శాస్త్రవేత్తల సాధన రహస్యాలను, పరిశోధన అంశాలను ఏర్చి, కూర్చి సులభతరంగా సామాన్యులకు సైతం సరళంగా అందించే క్రమంలో అంతర్జాతీయ ఆధ్యాత్మిక శాస్త్రవేత్తల సదస్సు నిర్వహిస్తున్నట్లు జంగారెడ్డిగూడెం పిరమిడ్ ట్రస్ట్ అధ్యక్షులు కాకి రామకృష్ణ, కార్యదర్శి తటవర్తి కృష్ణ తెలిపారు.

మఠంగూడెం టీడీపీ గ్రామ అధ్యక్షునిగా కిషోర్

విశాలాంధ్ర-లింగపాలెం: మఠంగూడెం తెలుగుదేశం పార్టీ గ్రామ అధ్యక్షునిగా తూంపాటి కిషోర్‌ను ఏకగ్రీవంగా ఎన్ను కున్నారు. కిషోర్ తాత దివంగత తూంపాటి సత్యనారాయణకు తెలుగుదేశం పార్టీలో మంచి పట్టు ఉంది. ఈయన వారసునిగా మనవడైన కిషోర్ ను గ్రామ పార్టీ అధ్యక్షునిగా ఎన్నుకున్నారు. ఈయన ఎన్నిక పట్ల గ్రామంలోని తెలుగుదేశం పార్టీ నాయకులంతా హర్షం వ్యక్తం చేశారు. తనను గ్రామపార్టీ అధ్యక్షునిగా నియమించినందుకు ఎమ్మెల్యే సొంగ రోషన్ కుమార్‌కు కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ బలోపేతానికి అందర్నీ కలుపుకొని కలిసికట్టుగా పనిచేస్తానని ఈ సందర్భంగా కిషోర్ తెలిపారు.

వాంద్రంలో మురుగు బోధి ప్రక్షాళన

విశాలాంధ్ర- ఉండి : మండల పరిధిలోని వాంద్రం గ్రామంలో మురుగు బోధి ప్రక్షాళన కార్యక్రమం వేగవంతంగా జరుగు తున్నది. స్థానిక ఎమ్మెల్యే, డిప్యూటీ స్పీకర్ కనుమూరి రఘురామ కృష్ణంరాజు ఆదేశాల మేరకు స్థానిక గ్రామ రెవెన్యూ అధికారులు సిహెచ్ చిన్నారావు ఆధ్వర్యంలో సర్వే నిర్వహించి హద్దులు గుర్తించారు. ఎన్నో ఏళ్ల తరబడి మురుగునీరు పారుదలకు ఆటంకంగా ఉన్న బోధిని రఘురామ కృష్ణంరాజు ఆదేశాల మేరకు తవ్వకం పనులు చేపట్టడంతో రైతులు స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ సందర్భంగా చిన్నారావు మాట్లాడుతూ బోధి తవ్వకం పనులు శరవేగంగా జరుగుతున్నాయన్నారు. వర్షాకాలం రావటంతో పనులు త్వరితగతిన పూర్తి చేయాలని డిప్యూటీ స్పీకర్ ఆదేశించి నట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో సచివాలయ కార్య దర్శి నవీన్, మండల రెవెన్యూ ఇన్స్పెక్టర్ రేవు కార్తీక్, వీఆర్‌వో గణేష్, సర్వేయర్ హసీనా బేగం, తదితరులు పాల్గొన్నారు.

కొయ్యలగూడెం మండల తహసీల్దారుగా నాగరాజు

విశాలాంధ్ర - కొయ్యలగూడెం : కొయ్యలగూడెం మండల తహసీల్దార్‌గా నల్లమిల్లి నాగరాజు బుధవారం బాధ్యతలు చేపట్టారు. ఇటీవల జరిగిన సాధారణ బదిలీల్లో భాగంగా నిడమర్రు మండలంలో తహశీల్దార్‌గా విధులు నిర్వర్తిస్తున్న ఆయన్ను కొయ్యలగూడెం మండలానికి బదిలీ చేస్తూ ఏలూరు జిల్లా కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేసారు. గతంలో కూడా ఈయన ఒక ఏడాదికి పైగా ఇక్కడ పనిచేశారు. మండల సమస్యలపై కూడా పూర్తి అవగాహన ఉన్న వ్యక్తి నాగరాజు. ఇప్పటివరకు ఇక్కడ తహశీల్దార్ గా పనిచేసిన కె.చెల్లన్నదొర కలెక్టరేట్ కోఆర్డినేషన్ సెక్షన్లో సూపరింటెండెంట్‌గా బదిలీ అయ్యారు. ఈమేరకు కొయ్యలగూడెం మండల జనసేన అధ్యక్షుడు తోట రవి, పట్టణ అధ్యక్షుడు మాదేపల్లి శ్రీనివాస్ ఆధ్వర్యంలో జనసేన శ్రేణులు నూతనంగా బాధ్యతలు చేపట్టిన నాగరాజుకు పుష్పగుచ్ఛం అందించి ఘన స్వాగతం పలికి,శుభాకాంక్షలు తెలిపారు. బదిలీపై వెళ్తున్న చెల్లన్న దొర ను దుశ్శాలువాలతో సత్కరించి ఘనంగా వీడ్కోలు పలికారు. ఈ కార్యక్రమంలో మేడిన కన్నయ్య, చవ్వా రాము, నక్క బాబి, కంకిపాటి వంశీ తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి పాఠశాలల ప్రారంభం

విశాలాంధ్ర-పెంటపాడు : బుధవారంతో వేసవి సెలవులు పూర్తయ్యి 2025-2026 విద్యా సంవత్సరం గురువారం నుంచి ప్రారంభమైందని పెంటపాడు మండల ఎంఈఓ-1 ఎం.శ్రీనివాస్ పత్రికా ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు ప్రభుత్వం ద్వారా అందించే అన్ని రకాల పథకాలు అందించబడతాయని, డొక్కా సీతమ్మ క్యాంటీన్ ద్వారా విద్యార్థులకు సన్న బియ్యం భోజన సదుపాయం ఏర్పాటు చేస్తున్నట్టు తెలిపారు.

పిల్లల ఉజ్వల భవిష్యత్తుకు పిల్లలను ప్రభుత్వ పాఠశాలలకు పంపించి ప్రభుత్వానికి సహకరించాలని ఎంఈఓ శ్రీనివాస్ తెలిపారు.

ఏరువాక (1వ పేజీ తరువాయి)

వ్యవసాయ శాఖ జిల్లా అధికారి షేక్ అబీబ్‌బాషా, మండల వ్యవసాయ అధికారి శివశంకర్, తెలుగుదేశం చాట్రాయి మండల అధ్యక్షులు ఇజ్జగాని వెంకటేశ్వరరావు, తెలుగు రైతు మహిళా జిల్లా కార్యదర్శి మాదాసు చంద్రకళ, టిడిపి జిల్లా అధికార ప్రతినిధి మండపాటి బసవరెడ్డి, తెలుగు రైతు జిల్లా ప్రధాన కార్యదర్శి మోరంపూడి శ్రీనివాస రావు, టీడీపీ మండల మాజీ అధ్యక్షులు మరిడి చిట్టిబాబు తదితరులు హాజరయ్యారు.

పటిష్టచర్యలు (1వ పేజీ తరువాయి)

శానిటేషన్, అనుమతులు లేని లేఅవుట్లలో నిర్మాణాలు, తదితర అంశాలపై సంబంధిత శాఖల అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ కాలువలకు నీరు విడుదల అయినందున మంచినీటి చెరువు లలో నీరు నింపుకొని సురక్షితమైన త్రాగు నీరును ప్రజలకు సరఫరా చేయాలన్నారు. ముందుగా ట్యాంకులు, పైప్‌లైన్ లీకేజీల మరమ్మతులు ఏమైనా ఉంటే వెంటనే రిపేర్లు పూర్తి చేయాలన్నారు. 2025 -26 సంవత్సరానికి ఆన్లైన్ ద్వారా పన్ను వసూళ్లను సత్వరమే ప్రారంభించాలన్నారు. ప్రభుత్వ స్థలాలు ఆక్రమించుకొని నిర్మాణాలు జరుగు తున్నా పట్టించుకోని అధికారులపై చర్యలు తీసుకుంటామని కలెక్టర్ హెచ్చరించారు. వీడియో కాన్ఫరెన్స్‌లో గ్రామ, వార్డు సచివా లయ అధికారి, ఇన్‌చార్జి డిపిఓ వై.దోసి రెడ్డి, ఎంపీడీవోలు, పంచాయతీ సెక్రటరీలు, డిఎల్‌పిఓలు, తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ లక్ష్యం (1వ పేజీ తరువాయి)

చేశారు. నిడదవోలు, ఉండ్రాజవరం, పెరవలి మండలాల్లోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో తాము ప్రారంభించిన భవనాలతో ప్రజలకు మెరుగైన వైద్య సేవలు మరింత చేరువవుతాయని విశ్వసిస్తున్నామన్నారు.

నాడు అధ్వానంగా రహదారులు... నేడు అద్దంలా రోడ్లు

గత ప్రభుత్వ ఐదేళ్ల కాలంలో ఖండవల్లి గ్రామంలో కొత్త రోడ్లు వేయకపోగా పాత రోడ్లు మరమ్మతుకు నోచుకోలేక వాహనదారులు ప్రమాదాల బారిన పడిన దుర్భర పరిస్థితులు చూశామని మంత్రి దుర్గేష్ ఆవేదన వ్యక్తం చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌ను కలిసి చర్చించి నియోజకవర్గంలో ఇప్పటివరకు కేవలం ఎన్ఆర్ఈజీఎస్ నిధుల క్రిందే దాదాపు రూ.31 కోట్లు ఖర్చు చేసి రోడ్లను వేశామన్నారు.

కార్యక్రమంలో ఏపీ స్కిల్ డెవలప్ మెంట్ చైర్మన్ బూరుగుపల్లి శేషారావు, జిల్లా కలెక్టర్ పి. ప్రశాంతి, ఉండ్రాజవరం, పెరవలి, నిడదవోలు మండలాల కూటమి పార్టీల అధ్యక్షులు, సర్పంచ్ లు, అధికారులు, ఆరోగ్య సిబ్బంది, రెవెన్యూ సిబ్బంది, వివిధ శాఖల సిబ్బంది, కూటమి నేతలు తదితరులు పాల్గొన్నారు.

సౌర విద్యుత్ (1వ పేజీ తరువాయి)

విద్యుత్‌కు రాష్ట్ర ప్రభుత్వం ప్రోత్సాహం అందిస్తున్నదన్నారు. సోలార్ విద్యుత్‌ను ఏర్పాటుచేసుకుని వారిలో షెడ్యూల్ కులాలు,తెగల వారికి ఉచితంగా, వెనుకబడిన తరగతుల వారికి అదనపు సబ్సిడీ అందిస్తున్నదన్నారు.

ప్రతి శాసనసభ్యులు తన పరిధిలో 10 వేల ఇళ్లకు సోలార్ విద్యుత్ అందించేలా లక్ష్యాన్ని నిర్ణయించిందన్నారు. రాష్ట్రంలోని వ్యవసాయ, అనుబంధ శాఖల కార్యాలయాలు, మార్కెట్ కమిటీలు, రైతుబజార్లకు దశలవారీగా సోలార్ పానెల్స్ ఏర్పాటు చేస్తామని మంత్రి చెప్పారు. ఏలూరు మార్కెట్ యార్డు, గుంటూరులోని మిర్చి యార్డులాగా పెద్ద మార్కెట్ యార్డ్ అని, నిమ్మకాయల పంట ఎక్కువగా వస్తుందన్నారు.

వ్యవసాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ బుడితి రాజశేఖర్, జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్వి, ఏలూరు ఎమ్మెల్యే బడేటి రాధాకృష్ణయ్య (చంటి), ఏలూరు ఆర్డీఓ అచ్యుత్ అంబరీష్, ఆప్కాబ్ చైర్మన్ గన్ని వీరాంజనేయులు, ఏలూరు నగర మేయర్ షేక్ నూర్జహాన్ పెదబాబు, కో ఆప్షన్ సభ్యులు ఎస్.ఎం.ఆర్. పెదబాబు, ఏలూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ మామిళ్ళపల్లి పార్థసారథి, వ్యవసాయ శాఖ జాయింట్ డైరెక్టర్ హబీబ్ బాషా, డిప్యూటీ మేయర్లు, కార్పొరేటర్లు ప్రభృతులు పాల్గొన్నారు.

పోరాటం (1వ పేజీ తరువాయి)

విమర్శించారు. రైతులు అప్పుల పాలై ఆత్మహత్యలకు పాల్పడుతున్నా కేంద్ర ప్రభుత్వానికి చీమకుట్టినట్లైనా లేదన్నారు. గత ఎన్నికల ముందు నరేంద్ర మోదీ రైతుల వద్దకు వచ్చి ధర్నా చేస్తుంటే రైతుల సమస్యల పరిష్కరిస్తానని హామీ ఇచ్చి క్షమాపణలు చెప్పి తీరా ఎన్నికల్లో గెలిచిన తర్వాత రైతులను నట్టేట ముంచాడని ఆగ్రహం వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వం పూర్తిగా అన్ని రంగాలలో విఫలమైందని మండిపడ్డారు. ఈ సమావేశంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు పి.సత్యనారాయణ, కేశవరపు అప్పలరాజు, ఏఐటీయూసీ జిల్లా నాయకులు శాఖ రామకృష్ణ, అర్జునరావు, కిషోర్, లక్ష్మి, సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.

జర్నలిస్టుల డిమాండ్లు పరిష్కరించాలి

విశాలాంధ్ర - జంగారెడ్డిగూడెం రూరల్ : జర్నలిస్టుల సమస్యలపై రాష్ట్ర వ్యాప్త నిరసనలో భాగంగా జంగారెడ్డిగూడెం ఆర్‌డివో, తహసీల్దార్ కార్యాలయాల ఎదుట ఆంధ్ర ప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్ట్‌ల ఫెడరేషన్ (ఏపీడబ్ల్యూజేఎఫ్) ఆధ్వర్యంలో బుధవారం జర్నలిస్టులు ఎదుర్కొం టున్న సమస్యలపై నిరసన వ్యక్తం చేస్తూ ప్రదర్శన నిర్వహిం చారు. సంబంధిత అధికారులకు డిమాండ్లతో కూడిన వినతి పత్రం సమర్పించారు. జర్నలిస్టులకు ఇతర రాష్ట్రాల్లో మాదిరిగా పెన్షన్ సౌకర్యం కల్పించాలని, అక్రిడిటేషన్ కమిటీలో ఏపీడబ్ల్యూజేఎఫ్, ఏపీడిజె ఏలకు స్థానం కల్పించాలని, జర్నలిస్టులపై జరిగే దాడులను అరికట్టేందుకు వీలుగా ప్రభుత్వం ఏర్పాటు చేసే కమిటీలలో ఫెడరేషన్ కు సభ్యత్వం కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర కార్యదర్శి కెఎస్ శంకర్రావు, స్టేట్ కౌన్సిల్ మెంబర్ కే బాలశౌరి, జంగారెడ్డిగూడెం డివిజన్ అధ్యక్షులు గొల్లమందల శ్రీనివాసరావు, కార్యదర్శి పి ఎన్ వి రామారావు తదితరులు పాల్గొన్నారు.

మద్దిలో స్వామివారిని దర్శించుకున్న సినీ నటులు

విశాలాంధ్ర - జంగారెడ్డిగూడెం రూరల్ : మండలంలోని గురవాయిగూడెం గ్రామంలో మద్ది ఆంజనేయస్వామి వారిని ప్రముఖ సినీ దర్శకులు శ్రీరామ్ వేణు (వకీల్ సాబ్), సినీ ఫోటో గ్రాఫర్ గుహన్ (అతడు, సీతమ్మ వాకిట్లో సిరిమల్లెచెట్టు), ఆదిత్య ఫిలిమ్స్ డిస్ట్రిబూటర్‌లు వెంకటేశ్వరరావు, రాంబాబు స్వామివారిని బుధవారం దర్శించుకున్నారు. ప్రత్యేక పూజలో పాల్గొన్నారు. వారికి ఆలయ మండపం వద్ద వేదపండితులు వేద ఆశీర్వచనం చేశారు.

శ్రీచైతన్య విద్యార్థులకు ప్రతిభ పురస్కారం

విశాలాంధ్ర-భీమడోలు: స్థానిక భీమడోలు శ్రీచైతన్య పాఠశాల ఆవర ణలో ప్రతిభ పురస్కారం అందుకున్న విద్యార్థికి అభినందన సభ ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపా ధ్యాయురాలు డి. సోఫినీ మాట్లాడుతూ తమ పాఠశాలకు చెందిన అల్లూరి ప్రణవి 10వ తరగతి పబ్లిక్ పరీక్షలలో 594/600 మార్కులు సాధించి నియోజకవర్గ స్థాయిలో ప్రథమ స్థానం సాధించి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ఇచ్చే ప్రతిభ పురస్కారం గెలుచుకున్నదని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏజీఎం పార్థ సారధి, రీజనల్ ఇన్‌చార్జి సిహెచ్.ఉదయ్ భాస్కర్, ఉపాధ్యాయ, ఉపాధ్యేతర సిబ్బంది పాల్గొన్నారు.

తహసీల్దారుగా నజీమ్ బాధ్యతల స్వీకరణ

విశాలాంధ్ర-లింగపాలెం: లింగపాలెం మండల తహసీల్దారుగా నజీమ్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. బాధ్యతలు తీసుకున్న తహసీల్దారును డిప్యూటీ తహసీల్దార్ ప్రసాద్, రీసర్వే డిప్యూటీ తహసీల్దార్ నాగబాబు, రెవిన్యూ ఇన్‌స్పెక్టర్ మాణిక్యాల రావు,గ్రామ రెవెన్యూ సంఘ నాయకులు శ్రీను, అప్పారావు తదితరులు మర్యాదపూర్వకంగా కలుసుకొని అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా బాధ్యతలు తీసుకున్న తహసీల్దార్ మాట్లాడుతూ ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా రెవెన్యూ సిబ్బంది విధులు నిర్వర్తించాలని కోరారు. రెవిన్యూ పరంగా ఏ సమస్య వచ్చినా వెంటనే పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని సిబ్బందిని ఆదేశించారు.

సంక్షేమ, అభివృద్ధి ఫలాలు అర్హులైన వారికి అందాలి : ఎంపీ పుట్టా మహేష్

విశాలాంధ్ర -ముదినేపల్లి : సంక్షేమాభివృద్ధి ఫలాలు ప్రతివారికి దక్కాలని ఏలూరు ఎంపీ పుట్టా మహేష్ కుమార్ యాదవ్ అన్నారు. ముదినేపల్లిలో గ్రీవెన్స్ సెల్‌లో మాట్లాడుతూ ప్రభుత్వం అన్ని వర్గాల వారికి వారి సమస్యలు పరిష్కరించుకునేందుకు గ్రీవెన్స్‌సెల్ ఏర్పాటు చేసిందన్నారు. వచ్చిన అర్జీలు ఆయా శాఖల అధికారులు పరిష్కరించే విధంగా పనిచేయాలన్నారు.

ప్రస్ఫుటంగా కనిపించిన సమాచార లోపం

అర్జీదారుల కంటే పార్టీ నాయకులు,కార్యకర్తలే ఎక్కువగా ఉండ డంతో మండల ప్రజలను గ్రీవెన్ సెల్ నిరుత్సాహ పరి చింది. ముదినేపల్లి వి కన్వెన్షన్ హాల్లో నియోజకవర్గస్థాయి గ్రీవెన్ సెల్ నిర్వహించారు. పుట్టా మహేష్ కుమార్ యాదవ్ హాజరయ్యారు. మండలంలోని సమస్యలు, అర్జీలు ఈ గ్రీవెన్ సెల్లో స్వయంగా ఎంపీకి ఇచ్చి పరిష్కరించుకుందామనుకున్న వారికి నిరుత్సాహం ఎదురైంది. ఈ సమాచారం గ్రామస్థాయిలో తెలియకపోవడంపై అధికారుల వైఫల్యం ప్రస్ఫుటంగా కనిపించింది. జిల్లాలోనే అతిపెద్ద మండలమైన ముదినేపల్లి రెవెన్యూ కు సంబంధించి కేవలం 6 అర్జీలే రావడం ఇందుకు నిదర్శనంగా పేర్కొనవచ్చు. మండల స్థాయి అధికారులు దీనిపై సమాచారం ఇవ్వకపోవడం ప్రజలు వినియోగించుకోలేక పోయా రన్న విమర్శలు వెల్లువెత్తాయి. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ కమ్మిలి విఠల్‌రావు, ఏపీ టూరిజం డెవలప్మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ కొడాలి వినోద్, నియోజకవర్గ టీడీపీ కన్వీనర్ వీరమల్లు నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ ఇళ్ల స్థలాలివ్వాలి

సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు చెల్లబోయిన రంగారావు

విశాలాంధ్ర -భీమవరం: అర్హులందరికీ ఇళ్లు అంటూ రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన జీఓ నంబరు 23ను తక్షణమే అమలు చేయాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు చెల్లబోయిన రంగారావు డిమాండ్ చేశారు. అర్హు లందరికీ ఇళ్ల స్థలాలు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ సీపీఐ ఆధ్వ ర్యంలో ఇళ్ల స్థలాల సాధన

కమిటీ నాయకులు ఇళ్ళ స్థలాల వ్యక్తిగత అర్జీలను బలుసుమూడి సచివాలయంలో అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణ ప్రాంతాల్లో 2 సెంట్లు, గ్రామీణ ప్రాంతాల్లో 3 సెంట్లు ఇళ్ళ స్థలాలిచ్చి పేదల సొంత ఇంటి కల నెరవేరుస్తామన్న హామీ ఎప్పటికి అమలు చేస్తారో చెప్పాలని డిమాండ్ చేశారు. తక్ష ణమే జీఓ అమలుకు ఆదేశాలిచ్చి అర్హులైన పేదలకు ఇళ్ళ స్థలాలు ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టి పది మాసాలు అవుతుందని, కాలయాపన లేకుండా తక్షణమే పేద లకు ఇళ్ళ స్థలాలు ఇవ్వాలని ఆయన కోరారు. కార్యక్రమంలో కట్టా రమేష్, సీపీఐ జిల్లా సమితి సభ్యులు ఎం.లక్ష్మిపతి, అర్జీదారులు సుధ, రుక్మిణి, సత్యవతి, భానుమతి తదితరులు పాల్గొన్నారు.

సీసీ రోడ్లు ప్రారంభించిన ఎమ్మెల్యే

విశాలాంధ్ర - పాలకోడేరు : పాలకోడేరు గ్రామంలో కొత్తపేట, మంగయ్య గారి చెరువుగట్టు వద్ద నూతనంగా నిర్మించిన రెండు సీసీ రోడ్లను ఉండి శాసన సభ్యులు, డిప్యూటీ స్పీకర్ కనుమూరి రఘురామ కృష్ణం రాజు బుధవారం ప్రారంభించారు. ఈ

సంద ర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో ఏ నియోజకవర్గంలో చేయని విధంగా ఉండి నియోజకవర్గాన్ని అన్ని రకాలుగా అభివృద్ధి పరంగా ముందుకు తీసుకు వెళ్తున్నానని అన్నారు. తన నియోజక వర్గంలోని ప్రజలందరూ వ్యక్తిగత సమస్యలు కాకుండా ప్రజలకు సంబంధించిన సమస్యలు ఏమైనా ఉంటే తన దృష్టికి తీసుకు రావాలని, సాధ్యమైనంత వరకు అన్ని సమస్యలను పరిష్కరించి అభివృద్ధికి మారుపేరుగా తన నియోజకవర్గాన్ని నిలుపుతానని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆయనతోపాటు ఉండి జనసేన పార్టీ కన్వీనర్ జుత్తిగ నాగరాజు, డెల్టా నీటి సంఘం అధ్యక్షులు కునాధ రాజు మురళి కృష్ణంరాజు, కొత్తపల్లి నాగరాజు, కూటమి నాయ ుకులు, కార్యకర్తలు ఎంపీడీవో వి. రెడ్డయ్య, మండల తహసీల్దార్ ఎన్. భారతి, విజయలక్ష్మి, పంచాయతీరాజ్ ఏఈ, ఇతర శాఖల సిబ్బంది పాల్గొన్నారు.

వ్యవసాయ కార్మికులకు సమగ్ర చట్టాన్ని చేయాలి

బికెఎంయు ఏలూరు జిల్లా కార్యదర్శి బండి వెంకటేశ్వరరావు

విశాలాంధ్ర-జంగారెడ్డిగూడెం: వ్యవసాయ కార్మికులకు కేంద్రం సమగ్ర చట్టాన్ని చేయాలని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం (బికేఎంయు) ఏలూరు జిల్లా కార్యదర్శి బండి వెంకటేశ్వరరావు డిమాండ్ చేశారు. ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం (బికే యంయు) ఆధ్వర్యంలో జంగారెడ్డి గూడెం తహసీల్దార్ కార్యాలయం వద్ద బుధవారం ధర్నా నిర్వహించారు. ధర్నాను ఉద్దేశించి బండి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ వ్యవసాయ కార్మికులకు సమగ్ర చట్టం చేయాలని దేశ వ్యాప్తంగా తహసీల్దారు కార్యాలయాల వద్ద ధర్నా నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా 200 రోజులు పని దినాలు కల్పించి, రోజుకు రూ.700 కనీస వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. గ్రామీణ ప్రాంతాల్లో ఇల్లు లేని పేదలకు మూడు సెంట్లు స్థలం, రూ.5 లక్షలు ఇంటి నిర్మాణానికి ఆర్థిక సహాయం అందించాలని డిమాండ్ చేశారు. ఎస్సీ, ఎస్టీ,సబ్ ప్లాన్ నిధులను సక్రమంగా అమలు చేయాలని డిమాండ్ చేశారు. సూపర్ సిక్స్ పథకాలను ప్రకటించిన ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తక్షణమే అమలు చేయాలని వెంకటేశ్వరరావు డిమాండ్ చేశారు. గ్రామాల్లో భూమిలేని పేదలకు ప్రభుత్వంలోని అన్ని రకాల మిగులు భూములను కుటుంబానికి హెక్టారు పంపిణీ చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం జంగారెడ్డిగూడెం మండల కార్యదర్శి గోలిమే బాల యేసు డిమాండ్ చేశారు. దేశ జనాభా లెక్కలతో పాటు ఎస్సీ,ఎస్టీ, బీసీ, ఓబీసీ కులగణన వివరాలను సేకరించాలని కోరారు.

ఈ కార్యక్రమంలో సీపీఐ మండల కార్యదర్శి జేవీ రమణ రాజు, నాయకులు సుంకర రాధాకృష్ణ (బాబు),బి కే ఎం యు నాయకులు గుదే ఆశీర్వాదం, నిట్టా రామారావు, మాండ్రు సాల్మే న్,కుంచె రాజశేఖర్, కుంచె మోహన్ కుంచే నాగేంద్ర, దొడ్డిగర్ల గాంధీ, తోట శిరీష ధనవంత్రం తదితరులు పాల్గొన్నారు. ధర్నా అనంతరం వ్యవసాయ కార్మికుల సమస్యలపై తహసీల్దార్ కార్యాలయంలో డిప్యూటీ తహసీల్దార్‌కు వినతిపత్రం సమర్పించారు.

సీపీఐ జిల్లా మహాసభలు జయప్రదం చేయండి

విశాలాంధ్ర- చింతలపూడి: భారత కమ్యూనిస్టుపార్టీ ఏలూరు జిల్లా రెండవ మహాసభలు చింతలపూడి పట్టణంలో జూలై 5,6,7 తేదీలలో జరుగనున్న సందర్భంగా వాటిని జయప్రదం చేయాలని కోరుతూ ఈనెల 18వ తేదీన జిల్లా వ్యాప్తంగా మోటార్ సైకిల్ ర్యాలీలు నిర్వహించాలని సీపీఐ జిల్లా రెండవ మహాసభల ఆహ్వాన సంఘం అధ్యక్షులు మామిళ్ళపల్లి వసంతరావు విజ్ఞప్తి చేశారు. 1925లో ఏర్పడిన భారత కమ్యూనిస్టు పార్టీ స్వాతంత్ర్య పోరాటంలో పాల్గొని సంపూర్ణ స్వతంత్రం నినాదం ఇచ్చింది. సీపీఐ అనేక చట్టాల రూపకల్పనలో భాగస్వాములు అయ్యిందని ఆనాటి నుంచి ఈనాటి వరకు ప్రజా సమస్యలపై పోరాడు తుందని అన్నారు. చింతలపూడి ప్రాంతంలో సీపీఐ ఏర్పడి 84 సంవత్సరాలు కావస్తుందని కారుమూడి సత్యనారాయణ రెడ్డి, కంచన కాశీ, మాదాసు వీర వెంకయ్య, మాదాసు శేషగిరిరావులతో మొదట సెల్ ఏర్పడిందని తెలిపారు. చింతలపూడి ప్రాంతంలో జమీం దారీ భూస్వామ్య వ్యవస్థలకు వ్యతిరేకంగా రైతాంగ సమస్యలపై పోరాడిందని చింతలపూడి ప్రాంత అభివృద్ధికి సిపిఐ పోరాటాలు ఎన్నో దోహదపడ్డాయని అన్నారు. మొట్టమొదటిసారిగా చింతలపూడి ప్రాంతంలో జిల్లా మహాసభలు జరుగుతున్నాయని జయప్రదం కోసం ఈనెల 18వ తేదీ జిల్లావ్యాప్తంగా జరిగే మోటార్ సైకిల్ ర్యాలీలో పార్టీ సభ్యులు, ప్రజాసంఘాల

కార్యకర్తలు పాల్గొనాలన్నారు.

సీపీఐ జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణ చైతన్య మాట్లాడుతూ జిల్లా మహాసభల జయప్రదం కోసం ప్రతి గ్రామ శాఖలో ప్రచారం నిర్వహించాలని తెలిపారు.మొదటి రోజు జరిగే బహిరంగ సభలో ప్రదర్శనలో 5000 మంది సభ్యులు సానుభూతిపరులు, ప్రజా సంఘాల కార్యకర్తలు అందరూ పాల్గొని జయప్రదం చేయాలన్నారు. సహాయ కార్యదర్శి ఉప్పులూరు హేమ శంకర్, రాష్ట్ర సమితి సభ్యులు బండి వెంకటేశ్వరరావు, జిల్లా కార్యవర్గ సభ్యులు కంచర్ల గురవయ్య, సన్నేపల్లి సాయిబాబా, జంపన వెంకట రమణ రాజు, కొండేటి బేబీ, ఆహ్వాన సంఘం కార్యదర్శి తుర్లపాటి బాబు, జిల్లా కౌన్సిల్ సభ్యులు పి.సోమశేఖర్, టీవీఎస్ రాజు, కే బుచ్చిబాబు, టి. ఆంజనేయరాజు, దొంతా కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు నిర్మాణానికి ఆక్రమణల తొలగింపు

విశాలాంధ్ర-ద్వారకాతిరుమల: ద్వారకాతిరుమల మండలం బుట్టాయి గూడెంలో రోడ్డు నిర్మాణానికి ఆక్రమణలు బుధవారం తొలగించారు. గోపాలపురం ఎమ్మెల్యే మద్దిపాటి వెంకటరాజు కృషితో కొవ్వూరు గుండుగొలను జాతీయ రహదారి నుంచి బుట్టాయిగూడెం వెళ్లే రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరయ్యాయి. ఈ క్రమంలో

పంచాయతీ సర్పంచి కేతా నాగసుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో ఈ రోడ్డు పొడవునా ఇరువైపులా ఉన్న ఆక్రమణలను తొలగించారు.

సీపీఐ మండల కార్యదర్శిగా కళింగ ఎన్నిక ఏకగ్రీవం

విశాలాంధ్ర-పెంటపాడు : పెంటపాడు మండల భారత కమ్యూనిస్టు పార్టీ కార్యదర్శిగా కళింగ లక్ష్మణరావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. సీపీఐ మండల మహాసభ ఆర్యవైశ్య కళ్యాణ మండపంలో జరిగింది. ఈ సందర్భంగా మండలం లోని వివిధ గ్రామాల నుండి వచ్చిన శాఖా కార్యదర్శులు,పార్టీ ప్రతినిధుల సమక్షంలో సభలో నూతన కమిటీని ఎన్నుకున్నారు. మండల కార్యదర్శిగా కళింగ లక్ష్మణ

రావు, సహాయ కార్యదర్శిగా కొలతల నాగరాజు,మండల సమితి సభ్యులుగా వంక అప్పారావు, దిద్దే నాగేశ్వరరావు, ఉయ్యూరు సత్యనారాయణ, ఎం.రాజేష్, కె. లక్ష్మణరావు, తాడిపర్తి గంగ, ముమ్మిడివరపు వెంకటలక్ష్మి లను ఎన్నుకున్నారు. నూతన కమిటీ భవిష్యత్తులో ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తుందని లక్ష్మణరావు తెలిపారు.

వివాదాల పరిష్కారానికి చర్యలు

సబ్ కలెక్టర్

విశాలాంధ్ర-లింగపాలెం: ధర్మాజీగూడెంలో బీరప్ప దేవుని మాన్యం భూమికి సంబంధించి తలెత్తిన వివాదాన్ని పరిష్కరించా లని ఆలయానికి చెందిన పలువురు నూజివీడు రెవెన్యూ డివిజన్ సబ్ కలెక్టర్ స్మరణ రాజును కోరారు. గ్రామంలోని మేకల మాణిక్యం 90 ఏళ్ల క్రితం బీరప్ప ఆలయానికి ఎకరం 70 సెంట్లు భూమిని దేవుని మాన్యంగా ఇచ్చింది. అప్పటినుంచి ఈ భూమిపై వస్తున్న ఆదాయంతో ఆలయ అభివృద్ధికి నిధులను ఖర్చు చేస్తు న్నారు. కొంతకాలం క్రితం ఈ భూమి తమకే చెందిన దని ఇద్దరు వ్యక్తులు అడ్డు తగిలారు. దీంతో వివాదం రాజుకుంది.

దీనిపై ప్రజా పరిష్కార వేదికలో ఆలయానికి సంబంధించిన వారు అధికారులకు ఫిర్యాదు చేశారు. ఈసమస్యను తెలుసుకునేందుకు సబ్ కలెక్టరు లింగపాలెం రెవెన్యూ కార్యాలయానికి విచ్చేశారు. ఫిర్యాదుదారుల అభిప్రాయాలను సబ్ కలెక్టర్ విన్నారు. రికార్డులను పరిశీలించి న్యాయం చేస్తానని ఈయన ఫిర్యాదు దారులకు హామీ ఇచ్చారు. దీనికి సంబంధించిన రికార్డులన్నిం టినీ తనకు అంద జేయాలని తహసీల్దార్ నజీమ్‌ను, రెవెన్యూ సిబ్బందిని ఆదేశించారు.

అక్రమంగా మట్టి తవ్వితే చర్యలు: అక్రమంగా మట్టి తవ్వకాలు జరిపితే ఊరుకునేది లేదంటూ సబ్ కలెక్టర్ ఈ సందర్భంగా హెచ్చరించారు.మట్టి తవ్వకాలకు ఇరిగేషన్ శాఖ అనుమతులు ఇస్తుందని, అవసరమైన వారు అనుమతులు తీసుకోవాలని తెలి పారు. అనుమతులు తీసుకోకుండా మట్టి తోలితే చర్యలు తప్పవని హెచ్చరిం చారు. ఈ సందర్భంగా లింగ పాలెం మండల రెవిన్యూ సిబ్బందిపై అసహనం వ్యక్తం చేశారు. మట్టి అక్రమ తవ్వకాలు జరుగుతుంటే ఏం చేస్తున్నారంటూ ప్రశ్నించారు.మీరు చర్యలు తీసుకోకపోతే మీ మీద చర్యలు తీసుకుంటామని సబ్ కలెక్టర్ రెవిన్యూ సిబ్బందిని హెచ్చరిం చారు. అయ్యపరాజుగూడెంలో మట్టి తవ్వకాలపై ప్రజలు ఫిర్యాదులు చేస్తున్నారని వీటిపై చర్యలు తీసు కోవాలని విలేకరులు సబ్ కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లగా దీనిపై ఈయన స్పందించి ఈ గ్రామంలో నిఘా పెడతామని అన్నారు. ప్రభుత్వం నిర్దేశించిన ప్రకారం అన్ని గ్రామాలలో దశలవారీగా రీసర్వే జరుగుతుందని తెలిపారు. రీసర్వే వల్ల భూముల వివాదాలు ఉండవని తెలిపారు.

నేడు ప్రభుత్వ ఐటిఐలో మెగా జాబ్ మేళా

విశాలాంధ్ర -భీమవరం: యువతకు ఉద్యోగావకాశాల కల్పనలో భాగంగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, నేషనల్ కెరీర్ సర్వీస్ ఆధ్వర్యంలో ఉండిలోని ప్రభుత్వ ఐ.టి.ఐ కళాశాల భీమవరంలో 12వ తేదీ గురువారం మెగా ప్లేస్మెంట్ డ్రైవ్ నిర్వహిస్తున్నట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి పి. లోకమాన్ తెలిపారు. ప్లేస్మెంట్ డ్రైవ్‌లో అమరరాజా గ్రూప్, సంధ్య మెరైన్, సూర్యామిత్ర, వర్క్ ఎక్స్,ఎయిర్ టెల్ పేమెంట్ బ్యాంకు, దేవి సీఫుడ్స్,యూ నో ఫీడ్స్, కోల్గేట్, అపోలో టైర్స్ మొదలైన ప్రముఖ కంపెనీలతో పాటు మరికొన్ని ఇతర కంపెనీలలో, ఫిట్టర్, ఎలక్ట్రీషియన్,సూపర్వైజర్, మెషిన్ ఆపరేటర్, మొదలైన ఉద్యోగ అవకాశాలు కల్పించడం జరుగుతుందన్నారు. 18-35 సంవత్సరాల వయస్సు వారు అర్హులని ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు. మరిన్ని వివరాలకు 9492885556, 9441841622 నెంబర్లను సంప్రదించాలని ఆయన తెలిపారు.

తెనాలి ఘటన దారుణం

విశాలాంధ్ర -భీమవరం: అనంతపురంలో గిరిజన విద్యార్థిని తన్మయిని హత్యచేసిన ముష్కరులను వెంటనే అరెస్టు చేసి శిక్షించాలని

దళిత ఐక్య వేదిక రాష్ట్ర అధ్యక్షుడు గంటా సుందర్ కుమార్ డిమాండ్ చేశారు. తన్మయి హత్యను నిరసిస్తూ బుధవారం తహసీల్దార్ కార్యాలయం వద్ద దళిత ఐక్య వేదిక ధర్నా నిర్వహించి ఇన్‌చార్జి తహసీల్దారుకు వితతిపత్రాన్ని సమర్పించారు. తొలుత జరిగిన ధర్నాలో గంట సుందరకుమార్ మాట్లాడుతూ తన్మయి ఉదంతం దారుణమని, దోషులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ఎస్సీ ఎస్టీ ఎట్రాసిటి చట్టాన్ని మరింత కఠినంగా అమలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ధర్నాలో పట్టెం శుభాకర్, జంగం మాణిక్యాల రావు, గెడ్డం జార్జి, అంబటి ఆనందకుమార్, పి.సాగర్, సాదె మహేష్, పి.శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

దేశానికి వెన్నుముక రైతే

విశాలాంధ్ర - గణపవరం: దేశానికి వెన్నెముక రైతేనని ఉంగుటూరు శాసనసభ్యులు పత్సమట్ల ధర్మరాజు అన్నారు. బుధవారం

ఏరువాక పూర్ణిమ సందర్భంగా గణపవరం మండలం సిహెచ్ అగ్రహారం చిలకంపాడు గ్రామంలో ఎమ్మెల్యే వ్యవసాయ పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా పశ్చిమగోదావరి జిల్లా వ్యవసాయ అధికారి జెడ్. వెంకటేశ్వరరావు మాట్లాడుతూ పశ్చిమగోదావరి జిల్లా వ్యాప్తంగా ఖరీఫ్ 2025గాను 2.08 లక్షల ఎకరాల్లో వరి సాగు చేస్తున్నారని తెలిపారు. గణపవరం మండలంలో ఈ ఖరీఫ్ సీజన్‌కిగాను 11,663 ఎకరాలు సాగు చేయనున్నట్టు తెలిపారు. ఎంటియు7029, ఎం టి యు1061, ఎం టి యు 1064 మొదలైన రకాలు అనుకూలంగా ఉంటాయని ఈ రకాలను ఎక్కువగా సాగు చేస్తున్నారన్నారు. ఎడిఎ పి. మురళీకృష్ణ, మండల వ్యవసాయ అధికారి యర్రంశెట్టి వెంకట సత్యనారాయణ ప్రసాద్ మాట్లాడారు. ఈ కార్యక్రమంలో జనసేన మండల ప్రెసిడెంట్ తోట శ్రీను, నీటి సంఘం ప్రెసిడెంట్ దాట్ల రంగరాజు, టీడీపీ మండల ప్రెసిడెంట్ ఇందుకూరి రామకృష్ణం రాజు, యాళ్ళ సుబ్బారావు, గ్రామ సర్పంచ్ చుక్క అప్పారావు, గ్రామాల కూటమి నాయకులు రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

నరసాపురంలో నిరసన ప్రదర్శన

విశాలాంధ్ర - నరసాపురం: అమరావతి మహిళలను అవమానించే విధంగా మాట్లాడిన సాక్షి మీడియాను రద్దు చేయాలని, వారిపై కేసులు పెట్టి కఠిన చర్యలు తీసు కోవాలని కోరుతూ కూటమి ప్రభుత్వం ఆధ్వర్యంలో బుధవారం నిరసన ప్రదర్శన నిర్వహించారు. అమరావతి మహిళలకు మద్దతు తెలుపుతూ స్థానిక శివాలయం సెంటర్ నుంచి అంబేద్కర్ సెంటర్ వరకు ప్రదర్శన కొనసాగింది. కార్యక్రమంలో అడ్వైజర్ గవర్నమెంట్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ (మైనార్టీ అఫైర్స్) సభ్యులు ఎంఏ షరీఫ్, ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే బొమ్మిడి నాయకర్, తెలుగుదేశం పార్టీ ఇన్‌చార్జి పొత్తూరి రామరాజు ఆధ్వర్యంలో జరిగిన ర్యాలీకి పార్టీలకు అతీతంగా పాల్గొన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర మత్స్యకారుల సహకార సంఘాల సమాఖ్య చైర్మన్ కొల్లు పెద్దిరాజు, రాష్ట్ర అగ్నికుల క్షత్రియ సాధికార కమిటీ కన్వీనర్, ఎఎంసీ మాజీ చైర్మన్ కొప్పాడ రవీంద్రనాథ్ ఠాగూర్ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి హామీ పని దినాలు 200 రోజులు కల్పించాలి

సీపీఐ పోలవరం నియోజకవర్గ కార్యదర్శి కారం దారయ్య

విశాలాంధ్ర - కొయ్యలగూడెం : ఉపాధి హామీ పని దినాలు 200 రోజులు కల్పించాలని సీపీఐ పోలవరం నియోజకవర్గ కార్యదర్శి కారం దారయ్య పేర్కొన్నారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద వ్యవసాయ కార్మిక సంఘం, సీపీఐ ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా కారం దారయ్య మాట్లాడుతూ ఉపాధి హామీ పనులు చేసే కూలీలకు 200 రోజులు పని దినాలు కల్పించాలని, రోజువారి వేతనం రూ.700 పెంపుదల చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కూటమి ప్రభుత్వం ఎన్నికలలో ఇచ్చిన హామీలను నెరవేర్చాలని తెలిపారు. సూపర్ సిక్స్ పథకాలను వెంటనే అమలు చేయాలన్నారు. గ్రామీణ ప్రాంతాలలో మూడు సెంట్లు భూమి,పట్టణాలలో రెండు సెంట్లు భూమి పేద ప్రజలకు ఇచ్చి, ఇల్లు నిర్మించుకోవడానికి రూ.5లక్షలు మంజూరు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. అనంతరం డిప్యూటీ తహసీల్దార్‌కు వినతి పత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ

మండల కార్యదర్శి తాడిగడప ఆంజనేయరాజు,వ్యవసాయ కార్మిక సంఘం మండల అధ్యక్షుడు చింతలపూడి దుర్గారావు, దుగ్గిరాల నారాయణరావు, సతీష్, సింహాద్రి, సత్యనారాయణ,ఇస్మాయిల్, సత్తిబాబు పాల్గొన్నారు.

నకిలీ అధికారులతో అప్రమత్తంగా ఉండండి

విశాలాంధ్ర-ఏలూరు: ఏలూరు నగరంలో ఉన్న పలు షాపు యజమానులకు కొంతమంది అపరిచిత వ్యక్తులు లేబర్ ఆఫీసర్ అని చెప్పి షాపు లైసెన్స్ ఉందా, లేదా రెన్యువల్ చేయాలి,రిజిస్టర్లు చూపాలని లేనిచో షోకాజ్ నోటీసులు,జరిమానాలు విధిస్తామని బెదిరింపు ఫోన్ కాల్స్ చేస్తున్నారని, అవినీతి, అక్రమాలకు పాల్పడుతున్నారని కార్మిక శాఖ దృష్టికి వచ్చినట్లు ఏలూరు సహాయ కార్మిక కమిషనరు జి. నాగేశ్వరరావు తెలిపారు. గత నెల 15వ తేదీ రాత్రి ఏలూరు నగరం,రామకృష్ణ పురం మినీ బైపాస్ వద్ద లక్ష్మి కార్ ఎలక్ట్రికల్ వర్క్స్ యజమాని ఉప్పులూరి హేమశంకర్‌కు ఇటువంటి బెదిరింపు ఫోన్ కాల్ చేయడంతో సదరు యజమాని పిజిఆర్ఎస్‌లో ఫిర్యాదు చేశారని పేర్కొన్నారు. ఇటువంటి అపరిచిత వ్యక్తుల నుండి వచ్చే ఫోన్ కాల్స్‌కు స్పందించ వద్దు అని షాపు యజమానులకు,ఛాంబర్ ఆఫ్ కామర్స్,ఏలూరు వారికి తెలియజేశారు. ఎలాంటి బెదిరింపు ఫోన్ కాల్స్ మీకు వచ్చినా కార్మిక శాఖ అధికారులను, 9492555073, 9492555074,9492555075 ఫోన్ నెంబర్లకు సంప్రదించవచ్చన్నారు.

ఈయుడిఏ చైర్మన్ శివ ప్రసాద్‌ను సన్మానించిన ఎంపీ

విశాలాంధ్ర -ఏలూరు : ఏలూరు అర్బన్ డెవలప్మెంట్ అథారిటీ (ఈయుడిఏ) చైర్మన్‌గా ఇటీవల బాధ్యతలు చేపట్టిన పెద్దిబోయిన శివప్రసాద్‌ను ఎంపీ పుట్టా మహేష్ కుమార్ అభినందించారు. ఈ మేరకు నగరంలోని ఈయుడిఏ కార్యాలయంలో చైర్మన్ శివప్రసాద్‌ను ఎంపీ మహేష్ కుమార్ బుధవారం కలిసి పుష్పగుచ్ఛాలు అందజేసి దుశ్శాలువాతో సన్మానించారు. భవిష్యత్తులో మరిన్ని ఉన్నత పదవులు అలంకరించాలని ఎంపీ ఆకాంక్షించారు. ఏలూరు నగర అభివృద్ధి ధ్యేయంగా పనిచేసి పదవికి వన్నె తీసుకురావాలని సూచించారు. ఏలూరు నగరాన్ని ఆదర్శంగా నిలిపే విషయంలో తనవంతు సహకారం అందిస్తానని ఎంపీ హామీ ఇచ్చారు. అనంతరం ఈయుడిఏ చైర్మన్ శివప్రసాద్, అధికారులు ఎంపీ పుట్టా మహేష్‌కు శాలువలు కప్పి ఘనంగా సత్కరించారు.

గుడిపాడులో ఘనంగా ఏరువాక పౌర్ణమి

విశాలాంధ్ర -ముసునూరు: దేశానికి అన్నం పెట్టే రైతన్నలు పంటలు పండించేందుకు వ్యవసాయ పనులకు శ్రీకారం చుడుతూ ఏరువాక పౌర్ణమి రోజున పండుగలా జరుపుకోవడం ఆనవాయితీగా వస్తుందని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం ఏలూరు జిల్లా ప్రధాన కార్యదర్శి రాయంకుల లక్ష్మణరావు అన్నారు. బుధవారం ముసునూరు మండలం లోని గుడిపాడు, చెక్కపల్లి, గుల్లపూడి తదితర గ్రామాల రైతులు తమ వ్యవసాయ క్షేత్రంలో అన్ని పనులలో తోడ్పాటుగా ఉండే ఎద్దులకు పసుపు కుంకుమలతో పూజలు చేసి, పలు అలంకరణలతో వాటికి నాగలి కట్టి వ్యవ సాయ పనులు ప్రారంభించారు. వ్యవసాయ పని ముట్లకు,ట్రాక్టర్లు, యంత్ర పరికరాలకు పూజలు నిర్వహించారు.ఈ సందర్భంగా లక్ష్మణరావు

మాట్లాడుతూ గుడిపాడు చుట్టుపక్కల గ్రామాల్లో చెట్టు పట్టాల ద్వారా పంచిన అటవీ బంజరు భూముల్లో బడుగు, బలహీన వర్గాల వారు వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారని, వీరికి శాశ్వత హక్కు పట్టాలు కల్పించి, సకాలంలో పంట రుణాలు ఇప్పించడం ద్వారా ప్రభుత్వం ఆదుకోవాలని ఆయన అన్నారు. ముళ్ళపూడి తిరుపతి స్వామి, గాంధీ, పల్లి తిరుపతి, ధర్మారావు, వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

వసతి గృహాల ఆకస్మిక తనిఖీ

మరమ్మతులు పూర్తి కాకపోవటంతో సబ్ కలెక్టర్ ఆగ్రహం

విశాలాంధ్ర-లింగపాలెం: ధర్మాజీగూడెంలోని బాలుర, బాలికల వసతి గృహాలను నూజివీడు రెవిన్యూ డివిజన్ సబ్ కలెక్టర్ స్మరణ్ రాజ్ బుధవారం ఆకస్మిక తనిఖీ చేశారు. పాఠశాలలు, వసతి గృహాలు పున: ప్రారంభం ముందు రోజు జరిగిన ఆకస్మిక తనిఖీకి ప్రాధాన్యత సంతరించుకుంది. వసతి గృహాలలో చదివే విద్యార్థులకు ప్రభుత్వం సన్నబియ్యం సరఫరా చేసింది. ఈ బియ్యాన్ని సబ్ కలెక్టర్

పరిశీలించారు. వసతి గృహాలలో చదివే విద్యార్థులకు ఆరోగ్యం, విద్య పట్ల ప్రత్యేక శ్రద్ధ చూపాలని వార్డెన్లను ఆదేశించారు. ఈరెండు వసతి గృహాల మరమ్మతులకు ప్రభుత్వం రూ.46 లక్షలు మంజూరు చేస్తే వీటి మరమ్మతులు ఇప్పటివరకు ఎందుకు పూర్తి చేయలేదని ప్రశ్నించారు. సెలవులకు ముందే మరమ్మతులు పూర్తి చేయాల్సి ఉండగా వసతి గృహాలు పున: ప్రారంభిస్తున్నప్పటికీ మరమ్మతులు పూర్తి కాకపోవడంతో సబ్ కలెక్టర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. మరమ్మతులు పూర్తి చేయకుండా ఏం చేస్తున్నారంటూ సిబ్బందిని ప్రశ్నించారు. రెండు వసతి గృహాలలో సౌకర్యాలను పరిశీలించారు. ఈయనతో పాటు తహసీల్దార్ నజీమ్, వార్డెన్లు రాధాకృష్ణ,సునీత ఉన్నారు.

అదనపు కట్నం కోసం వేధిస్తున్న ఏడుగురిపై కేసు నమోదు

విశాలాంధ్ర-టి నరసాపురం: అదనపు కట్నం కోసం వేధిస్తున్న ఏడుగురు వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ ఎం.జయబాబు తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం టి.నరసాపురం మండలంలోని తిరుపతి పాడు గ్రామానికి చెందిన పోతన నాగదేవికి, ఏలూరు జిల్లా ద్వారకా తిరుమల మండలం తూర్పు సాయంపాలెం గ్రామానికి చెందిన పోతన శివరామ కృష్ణతో వివాహం అయ్యింది. వివాహ సమయంలో రూ.8 లక్షలు కట్నం ఇచ్చారు. వివాహం అయిన కొద్ది కాలం బాగానే చూసుకున్నారు. ఆ తరువాత శివ రామ కృష్ణ కుటుంబ సభ్యులు అదనపు కట్నం తీసుకురావాలంటూ నాగదేవిని శారీరకంగా, మానసికంగా వేధించటంతో అనేక సార్లు పెద్దల్లో పంచాయతీ పెట్టినా పెద్దల మాట ధిక్కరించి అధిక కట్నం తీసుకురావాలంటూ ఇంటి నుంచి గెంటి చేయడంతో నాగదేవి ఫిర్యాదుతో శివ రామ కృష్ణ కుటుంబ సభ్యులు ఏడుగురు వ్యక్తుల పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన తెలిపారు.

అధిక రక్తపోటుతో బ్రెయిన్ స్ట్రోక్

విశాలాంధ్ర - గణపవరం: మనుషులలో అధిక రక్తపోటు వలన గుండెకు సంబంధించిన వ్యాధులు, బ్రెయిన్ స్ట్రోక్ వచ్చే అవకాశం ఉన్నాయని గణపవరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్య అధికారి డాక్టర్ పల్లికొండ కిరణ్మయి అన్నారు. ప్రపంచ రక్తపోటు దినోత్సవ సందర్భంగా బుధవారం డాక్టర్ కిరణ్మయి, డాక్టర్ కమతం ఓంకార్ నాథ్

ఆధ్వర్యంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నుండి పోలీస్ స్టేషన్ వరకు సిబ్బందిచే అవగాహన ర్యాలీ నిర్వహించారు. అనంతరం రక్తపోటు వల్ల వచ్చు ప్రమాదములు, దానివల్ల అవయవాలు చెడిపోయే అవకాశం ఉంటుందని రక్తపోటును ఎలా నియంత్రించుకోవాలో, ఆహార నియమాలు ఎలా పాటించాలో వైద్యాధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ జాలాది విల్సన్ బాబు, హెచ్‌వి సత్యవతి, ఎం పి హెచ్ ఎస్ ముప్పాల బాల మురళి, ఆరోగ్య కార్యకర్తలు సిబ్బంది పాల్గొన్నారు.

నేడు ఆగిరిపల్లిలో విద్యుత్ అదాలత్

విశాలాంధ్ర - ఆగిరిపల్లి: నూజివీడు డివిజన్ పరిధిలోని ఆగిరిపల్లి, అడవినెక్కలం, ముసునూరు, రమణక్కపేట సెక్షన్ పరిధిలోని విద్యుత్ వినియోగదారులందరికీ గురువారం విద్యుత్ అదాలత్ నిర్వహిస్తున్నట్లు నూజివీడు ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఎ. సత్యనారాయణ తెలిపారు. ఆగిరిపల్లిలోని పొన్నం కళ్యాణ మండపంలో సిజిఆర్ఎఫ్ ఆధ్వర్యంలో ఉదయం 10:30 నుండి మధ్యాహ్నం 1:00గంట వరకు జరిగే అదాలత్‌లో వినియోగదారుల నుండి అందే సమస్యలను స్వీకరిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో సిజిఆర్ఎఫ్ చైర్మన్ విక్టర్ ఇమ్మానుయేల్, సాంకేతిక సభ్యులు ఎస్. శ్రీనివాసరావు, ఆర్థిక సభ్యులు సిహెచ్ శ్రీనివాసరావు, స్వతంత్ర సభ్యులు ఎ. సునీత హాజరై వినియోగదారుల సమస్యలను పరిష్కారిస్తారన్నారు.

బస్‌పాస్ మార్పులకు సహకరించాలి

– జిల్లా ప్రజా రవాణా అధికారి వై.సత్యనారాయణ మూర్తి

విశాలాంధ్ర-రాజమహేంద్రవరంరూరల్ : ప్రతినెల విద్యార్థులకు, ఉద్యోగులకోసం రాయితీలపై అందించే బస్ పాస్ మార్పులకు ప్రతి ఒక్కరు సహకరించాలని తూర్పుగోదావరి జిల్లా ప్రజా రవాణా అధికారి వై.సత్యనారాయణ మూర్తి అన్నారు. ఇందుకు సంబంధించి పత్రిక ప్రకటన బుధవారం విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2025–26 విద్యా సంవత్సరానికి సంబంధించి ఏపీఎస్ ఆర్టీసీ తూర్పుగోదావరి జిల్లా పరిధిలో ఉన్న డిపోలలో విద్యార్థులకు, నెలసరి ఉద్యోగులకు ఇచ్చే సీజన్‌పాస్‌లకు సంబంధించి బస్సు పాసులు అప్డేషన్ ఆధునీకరణ చేస్తున్న కారణంగా ఈనెల 12న బస్‌పాసులు జారీ నిలిపివేస్తున్నామని, తిరిగి 13 నుండి యధావిధిగా జారీ చేస్తున్నట్లు చెప్పారు. విద్యార్థులు కొత్త బస్‌పాసులను ఆన్‌లైన్ ద్వారా పొందే సదుపాయాన్ని కల్పించినట్లు చెప్పారు. http://buspassonline. apsrtcin /ఈ విషయాన్ని గమనించి బస్సుపాసులను తీసుకోవాలనివిజ్ఞప్తి చేశారు.

ఏలూరు డీపీటీవోగా షేక్ షబానా

విశాలాంధ్ర-రాజమహేంద్రవరం రూరల్ : ఏలూరు జిల్లా ప్రజా రవాణా అధికారి (డిపిటివో) గా షేక్‌షబానా పదోన్నతి పొంది బదిలీ తరలి వెళ్లారు. జిల్లా కేంద్రమైన రాజమహేంద్రవరం ఏపీఎస్ ఆర్టీసీ డిపో మేనేజర్‌గా సేవలందించిన ఆమెకు ఉన్నతాధికారులు ఆదేశాలు బుధవారం అందు కున్నారు. దీంతో ఆమెకు డిపోఉద్యోగులు శుభాకాంక్షలు తెలిపారు. అలాగే రాజమహేంద్రవరం డిపో అసిస్టెంట్ కమర్షియల్ మేనేజర్‌గా విధులు నిర్వహించిన కె.మాధవ్ కి డిపో మేనేజర్ పదోన్నతి పై బదిలీ అయ్యారు. అదేవిధంగా కొవ్వూరు డిపో మేనేజర్‌గా సేవలందించిన వై వీవీఈఎన్ కుమార్ రావులపాలెం డిపో మేనేజర్‌గా బదిలీపై తరలి వెళ్లారు. ఈ సందర్భంగా ఆయా డిపో అధికారులు, సిబ్బంది సాధారణ ంగా శుభాకాంక్షలు తెలిపారు.

మామిడికుదురు టీడీపీ
గ్రామ శాఖ అధ్యక్షులుగా కంచి విశ్వనాథం

విశాలాంధ్ర-మామిడి కుదురు : మామిడి కుదురు తెలుగు దేశం పార్టీ గ్రామ శాఖ అధ్యక్షులుగా కంచి విశ్వనాథం ఎన్నికయ్యారు. బుధవారం మామిడి కుదురులో జరిగిన పార్టీ కార్యకర్తల సమావేశంలో అధ్యక్ష, కార్యదర్శులు ఎన్నిక జరిగింది. కార్యదర్శిగా నామన రాధా కృష్ణ మనో హర్‌ను పార్టీ శ్రేణులు ఎన్నుకున్నారు. కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకి వివరించాల్సిన భాధ్యత నూతన కమిటీపై ఉందని టీడీపీ సీనియర్ నేత, రాజోలు నియోజకవర్గ తెలుగు రైతు అధ్యక్షులు ఈలి శ్రీనివాస్ తెలిపారు. నూతనంగా ఎన్నికైన అధ్యక కార్యదర్శులు విశ్వనాథం, రాధాకృష్ణ మనోహర్‌లను పలువురు అభినందించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు నయినాల అబ్బాస్, సాపే కాశీ, అప్పారీ వేంకటేశ్వరరావు, కడలి రంగా, పెచ్చెట్టి విజయ భాస్కర రావు, కంచి గాంధీ, దామోదరం, బంధన సూర్యనారాయణ, ముగ్గు పిచ్చయ్య, ఇంటి వెంకట నారాయణ, తదితరులు పాల్గొన్నారు.

జగన్మోహిని కేశవ స్వామికి విరాళాలు

విశాలాంధ్ర-ఆత్రేయపురం : మండల కేంద్రంలో ర్యాలీ గ్రామంలోని వెలి సిన పురాతనమైన దేవాలయాల్లో విశిష్ట కలిగిన ఆలయం శ్రీ జగన్మోహిని కేశవ స్వామి ఆలయం. ఆలయంలో ఈ ముందు పురుషుని రూపం వెనుక స్త్రీ రూపంలో భక్తులకు స్వామి వారు దర్శనం ఇస్తారు. అమలాపురం మండలం, బండారులంక వాస్తవ్యులు భోజనపల్లి కేశవ కృష్ణ రత్నమాల దంపతులు ర్యాలి శ్రీ జగన్మోహిని కేశవ, గోపాల స్వామి వారిని దర్శించుకొని శ్రీ స్వామివారి అన్నదాన పథకమునకు రూ.10,116/-లు, దెందులూరు మండలం, సీతంపేట వాస్తవ్యులు సుంకర మహేష్ కుమార్ జ్యోత్స్న దంపతులు ర్యాలి శ్రీ జగన్మోహిని కేశవ, గోపాల స్వామి వారిని దర్శించుకొని శ్రీ స్వామి వారి అన్నదాన పథకమునకు రూ.10,116/-లు విరాళం అందించారు. కార్యనిర్వహణ అధికారి భాగవతుల వెంకట రమణ మూర్తి, శ్రీనివాస్, దత్తు స్వామి వారి చిత్రపటం చరిత్ర కలిగిన పుస్తకం శేష వస్త్రాలతో సత్కరించారు.

పశు వైద్యశాల ప్రారంభించిన ఎమ్మెల్యే వేగుళ్ళ

విశాలాంధ్ర-కపిలేశ్వరపురం : కపిలేశ్వరపురం మండలం అంబేద్కర్ కోనసీమ జిల్లా టేకి గ్రామంలో రూ.29 లక్షలు అంచనా నిర్మించిన పశువైద్యశాలను మండపేట నియోజకవర్గ ఎమ్మెల్యే వేగుళ్ళ జోగేశ్వర రావు ప్రారంభించారు. వ్యవసాయం నకు అనుబంధంగా పశువుల పెంపకం ద్వారా ఆదాయం సమకూరాలని సీఎం చంద్రబాబు ఆశ యం అని ఎమ్మెల్యే వేగుళ్ళ అన్నారు. 2014–19టీడీపీ పాలనలో గోపాల మిత్ర పథకం ద్వారా పాడి రైతులకు పశువుల షెడ్ల నిర్మాణం కోసం నిధులు మంజూరు చెయ్యడం జరిగిందన్నారు. పాడిపరిశ్రమ అభివృద్ధికి ఎన్డీయే కూటమి ప్రభుత్వం అన్ని విధాలుగా సహాయ సహకారాలు అందిస్తుందని వేగుళ్ల బరోసా ఇచ్చారు. కార్యక్రమంలో టేకి గ్రామ సర్పంచ్ కుక్కల నాగమణి, మండల టిడిపి అధ్యక్షులు బలవరెడ్డి సత్తిబాబు, అమలాపురం పార్లమెంటరీ నియోజక వర్గ టీడీపీ అధికార ప్రతినిధి పుత్సల శ్రీనివాస్, గ్రామ టీడీపీ అధ్యక్షుడు మేడిశెట్టి శ్రీనివాస్, దాసరి శ్రీనివాస్, నెక్కంటి బుచ్చి రామారావు, కడలి పనస రామయ్య, కూళ్ళ సాగు నీరు పంపిణీ అధ్యక్షుడు మేకా శివప్రసాద్, పశుసంవర్ధక ఏడి అనిత, మండల పశువైద్య అధికారి వివి రమణ మూర్తి, అధికసంఖ్యలో కూటమిశ్రేణులు పాల్గొన్నారు.

జాబ్ మేళా కరపత్రం ఆవిష్కరణ

విశాలాంధ్ర-అనపర్తి : నిరుద్యోగులకు ఉద్యోగ, ఉపాధి కల్పించేందుకు నిర్వహిస్తున్న మెగా జాబ్ మేళా నిరుద్యోగ యువత సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి అన్నారు. బుధవారం రామవరంలో ఈనెల 13న అనపర్తిలో జరిగే మెగా జాబ్ మేళా కరపత్రాన్ని ఎమ్మెల్యే నల్లమిల్లి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ 19 కంపెనీలు ఈ జాబు మేళాలో పాల్గొంటాయని నిరుద్యోగ యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

కడియం పోలీస్ స్టేషన్ సందర్శించిన సౌత్ జోన్ డీఎస్పీ

విశాలాంధ్ర-కడియం : తమ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా సిబ్బంది అప్రమ త్తంగా ఉండాలని తూర్పుగోదావరి జిల్లా, రాజమహేంద్రవరం, సౌత్ జోన్ డిఎస్పీ ఎస్ భవ్య కిషోర్ అన్నారు. ఆమె మంగళవారం సాయంత్రం సాధారణ తనిఖీలలో భాగంగా కడియం పోలీస్ స్టేషన్ సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 2022వ సంవత్సరానికి ముందు ఉన్న పెండింగ్ కేసులను త్వరితగతిన దర్యాప్తు చేసి, చార్జిషీట్ ఫైల్ చేయాలని కడియం పోలీస్ స్టేషన్ ఎస్‌హెచ్‌ఒకు సూచనలు చేశారు. మండలంలోని ప్రతి గ్రామానికి కేటాయించిన అడాప్టర్ కానిస్టేబుల్‌లు తమ గ్రామంలో ఉన్న రౌడీలు, సస్పెక్ట్‌లపై పూర్తి నిఘా ఉంచాలని, రోజువారి ఎన్ఫోర్స్మెంట్ వర్క్ పెంచాలని స్టేషన్ సిబ్బందికి సూచించారు.

సత్యనారాయణ మూర్తికి ఉత్తమ పురస్కారం

విశాలాంధ్ర - అమలాపురం : స్థానిక ఏపీఎస్ఆర్టీసీ అమలాపురం డిపో నందు గ్యారేజ్ ఆవరణలో బుధవారం ఆదర్శ ఉద్యోగుల అభినందన సభను జిల్లా ప్రజా రవాణా అధికారి ఎస్‌టిపి రాఘవకుమార్ ముఖ్య అతిథిగా నిర్వహిం చారు. ఈ కార్యక్రమంలో భాగంగా వివిధ విభాగాలలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన ఉద్యోగులను ప్రశంసా పత్రాలు, నగదు పురస్కారాలతో సత్కరించారు. 2024–25 ఆర్థిక సంవత్సరానికి గాను ఇంధన సామర్థ్యం విభాగంలో టార్గెట్లు సాధించినందుకు డిపో మేనేజర్ చల్లా సత్యనారాయణ మూర్తి, గంగు మళ్ళ రమాలక్ష్మి దేవి అసిస్టెంట్ ఇంజనీర్ (మెకానికల్), నరసింహారావు సూపరిం డెంట్ (మెకానికల్), టెక్నీషియన్స్ గౌరీనాథ్ & శివన్నారాయణ తదితరులకు ప్రశంసా పత్రాలు నగదు పురస్కారాలతో సత్కరించారు. యంవిడి ప్రసాద్, వీయస్ రావు కండక్టర్లకు ప్రశంసా పత్రాలు, నగదు పురస్కారం వీరితో పాటు ఆన్యాల్ విధానంలో పని చేస్తూ ఇంధన సామర్థ్యంలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన ఇద్దరు డ్రైవర్లకు ఎస్‌టిపి రాఘవ కుమార్, డిపో మేనేజర్ చల్లా సత్యనారాయణమూర్తి ప్రత్యేక బహుమతులను అందించారు. అసిస్టెంట్ మేనేజర్ ప్రతిమకుమారి, అసిస్టెంట్ ఇంజనీర్ దేవి, ఓపిఆర్ఎస్ సూపర్వైజర్ వరహాల బాబు, ట్రాఫిక్, గ్యారేజ్ సిబ్బంది పాల్గొన్నారు.

కొత్తగా 128 స్పౌజ్ ఫించన్లు మంజూరు

విశాలాంధ్ర - కడియం : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ఎన్టీఆర్ భరోసా పింఛన్లు పథకం క్రింద, కడియం మండలానికి 128 స్పౌజ్ పింఛన్లు నూతనంగా మంజూరైనట్లు ఎంపీడీవో కె రమేష్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పింఛన్ల సొమ్ము పంపిణీ కార్యక్రమం కడియం మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో జరుగుతుందని తెలిపారు.

ఎత్తి పోతల నిర్వహణకు
రైతుల సహకారం కావాలి : ఎమ్మెల్యే ముప్పిడి

విశాలాంధ్ర-తాళ్లపూడి : ఏరువాక పౌర్ణమి సందర్భాన్ని పురస్కరించుకుని తాళ్లపూడి మండలం పైడిమెట్ట ఎత్తిపోతల పథకం ద్వారా రైతాంగానికి ఖరీఫ్ సీజన్‌కి గాను కొవ్వూరు నియోజకవర్గ శాసనసభ్యులు ముప్పిడి వెంకటేశ్వరరావు పంప్‌హౌస్ వద్ద స్విచ్ ఆన్ చేసిసాగు నీటిని విడుదల చేసారు. ఈ నేప థ్యంలో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ఆర్థికంగా ఇబ్బందుల్లో ఉన్నప్పటికీ రైతాంగం కోసం ప్రభుత్వం పని చేస్తుందన్నారు. ఎత్తి పోతల రైతు సంఘ అధ్యక్షులు ముళ్ళపూడి శ్రీరామచంద్రమూర్తికి సహకారం అందించి, సకాలంలో నీటీ తీరువా చెల్లించి ఎత్తి పోతలను ముందుకు తీసుకువెళ్లాలని ఎమ్మెల్యే ముప్పిడి కోరారు. ఆయకట్టులో ఉన్న బకాయి కట్టని రైతుల పేర్లు బహిరంగ పరచాలని ఓ రైతు డిమాండ్ చేశాడు. పెద్ద రైతుల వల్ల చిన్న రైతులు ఇక్కట్లు ఎదుర్కొంటున్నామన్నారు. కార్యక్రమంలో ఆయకట్టు రైతులు, ఎత్తి పోతల నిర్వహణ కమిటీ సభ్యులు, తహసీల్దార్ భారతి, కూటమి నాయకులు చలపాటి ప్రకాష్, అనపర్తి ప్రసాద్, కొర్లపాటి దత్తుడు, గణపతి, తదితరులు పాల్గొన్నారు.

కాకినాడ పట్టణ ప్రజలకు విజ్ఞప్తి

విశాలాంధ్ర - కాకినాడ : కాకినాడ నగరంలోని పశువులు యజమానులు తమ పశువులను రోడ్ల పైకి వదిలి వేయడం వల్ల, రోడ్డు ప్రమాదాలు జరిగి పశువులకు, తీవ్రమైన గాయాలు కలుగుతున్నవి. కొన్ని సందర్భములో పశువులు చనిపోవడం కూడా జరుగుతున్నది. సదరు రోడ్ ప్రమాదాలలో వాహనదారులకు, పశువులకు తీవ్రమైన గాయాలు కలుగుతున్నాయి వాహనాలకు కూడా డామేజ్ జరుగుతున్నాయి. ఈ పశువుల విషయంలో కాకినాడ ప్రజలు నుండి అనేక పిర్యాదులు పోలీసు వారికి అందుతున్నాయి. కావున పశువుల యజమానులు దీనిని గమనించి మీ పశువులను రోడ్డుపైకి వదలకుండా తగు జాగ్రత్తలు తీసుకోవలసినదిగా కోరుచున్నాము. ఇకపై పశువులు రోడ్ పైకి వదిలిన యెడల కాకినాడ మున్సిపల్ అధికారుల సహాయంతో స్పెషల్ డ్రైవ్ నిర్వహించి సదరు పశువులకు తరలించడం జరుగుతుంది. పశువుల యజమానులు దీనిని గమనించగలరని మనవి.

రక్తదానంపై అవగాహన ర్యాలీ

విశాలాంధ్ర-అమలాపురం : ప్రపంచ రక్తదాత దినోత్సవం సందర్భంగా జూన్ 10 నుండి 14వరకూ రక్తదానం యొక్క ప్రయోజనాలపై అమలాపురం ఏరియా ఆసుపత్రిలో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఇందులో బుధవారం ఏరియా ఆసుపత్రి నుంచి నల్లవంతెన వరకూ రక్తదాన అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీలో డిస్ట్రిక్ట్ లెప్రసీ ఎయిడ్స్ అండ్ టీబి ఆఫీసర్ డాక్టర్ భరతలక్ష్మి, ఏరియా ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ శంకర్రావు, ఏరియా ఆసుపత్రి ఆర్ఎంఓ డాక్టర్ అనూష, బ్లడ్ సెంటర్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ పూలఅన్నపూర్ణ, బ్లడ్ సెంటర్ సిబ్బంది దొడ్డాకాశి, ఎల్లమెల్లి రమణ మూర్తి, చెల్లింగి రాజశేఖర్, చిట్టిమేను కృష్ణ మరియు ఏరియా ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సభ్యులు వలవల శివరావు, ఆవుపాటి గోపాల్ మరియు ఏరియా ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

జాతీయ క్రీడలు నిర్వహించేందుకు కృషి

- ఆరు నెలల్లో నన్నయ అభివృద్ధి నిర్మాణాలు పూర్తి
- నత్తనడకన సాగుతున్న నిర్మాణాలపై అసంతృప్తి
- నన్నయ వర్సిటీని సందర్శించిన శాప్ ఛైర్మన్ అనిమిని రవినాయుడు

విశాలాంధ్ర - రాజానగరం : రాజమహేంద్రవరం ప్రాంతానికే తలమానికంగా ఉన్న నన్నయ వర్సిటీలో జాతీయ క్రీడలు నిర్వహించేందుకు కృషి చేస్తున్నామని, అభివృద్ధి భవన నిర్మాణాలను రానున్న ఆరు నెలల్లో కాలంలో పూర్తి చేస్తామని స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ (శాప్) ఛైర్మన్ అనిమిని రవినాయుడు అన్నారు. మండలంలోని ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయాన్ని బుధవారం ఆకస్మి కంగా సందర్శించారు. దీనిలో భాగంగా ఖేలో ఇండియా నిధులతో నిర్మిస్తున్న మల్టీపర్పస్ ఇండోర్‌స్టేడియం, స్విమ్మింగ్ పూల్ నిర్మాణపనులను పరిశీ లించారు. నిర్మాణాలు నత్తనడకన సాగడంతో అసంతృప్తి వ్యక్తంచేశారు. సదరు గుత్తదారుడు (కాంట్రాక్టర్)ను పలు వివరాలు అడిగి తెలుసుకు న్నారు. సదరు గుత్తదారుల నిర్లక్ష్య వైఖరిపై ఆగ్ర హం వ్యక్తం చేశారు. అలాగే వర్సిటీ ఉపకులపతి ఆచార్య సత్తుపాటి ప్రసన్నశ్రీ, రిజిస్ట్రార్ జి.సుధాకర్, వర్సిటీ ఇంజనీర్లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయంలో విద్యార్థులు అన్ని వసతులు కల్పించాలన్న లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్న నిర్ణయాలు వెల్లడించారు. నన్నయ వర్సిటీ ప్రాంగణంలో నిర్మాణం చేపట్టిన మల్టీపర్పస్ ఇండోర్ స్పోర్ట్స్‌కాంప్లెక్స్, స్విమ్మింగ్ పూల్ నిర్మాణాల అంశంలో గుత్తదారుల, యూనివర్సిటీ ఇంజనీర్ల నిర్లక్ష్యంతో అభివృద్ధి పనులు నత్తనడకన సాగుతున్నా యని అసహనం వ్యక్తం చేశారు.గత పాలకులు, అధికారుల అనాలోచిత నిర్ణయాల వల్ల పనుల్లో జాప్యం జరిగిందని ఆరోపించారు. నన్నయ వర్సిటీలో నెలకొని ఉన్న సమస్యలను ప్రభుత్వం దృష్టికి సమస్యను తీసుకెళ్లి పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. మల్టీపర్పస్ ఇండోర్ స్టేడియం నిర్మాణాలు పూర్తయ్యేం దుకు రూ.6.10 కోట్లు, స్విమ్మింగ్ పూల్ నిర్మాణానికి రూ.3.16 కోట్లు అవసరం అవుతుందని చెప్పారు. నిర్మాణాలు పూర్తి చేసి జాతీయ స్థాయి పోటీలు నిర్వహించాలనే సంకల్పంతో ఉన్నామన్నారు. క్రీడల ద్వారా విశ్వవిద్యాలయానికి రాజమహేంద్ర వరం ప్రాంతానికి మరింత అభివృద్ధి, మంచి పేరు వస్తాయన్నారు. కార్యక్రమంలో తెలుగు యువత జిల్లా అధ్యక్షులు కందులబాబు రాయుడు, నియోజకవర్గ టీడీపీ సోషల్ మీడియా కన్వీనర్ సోడసాని త్రిమూర్తులు,సీతానగరం మండలం తెలుగు యువత అధ్యక్షులు గుడపాటి శ్రీనివాస్(బాబీ), విశ్వ విద్యాలయ అధికారులు, స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ అధికారులు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

హైకోర్టు న్యాయవాది చలపతికి సన్మానం

విశాలాంధ్ర - ఏలేశ్వరం : దళిత గిరిజన నిరుపేద సమస్యల పరి ష్కారానికి హైకోర్టులో పోరాడు తున్న ప్రముఖ న్యాయవాది ఎం చలపతిని సిపిఎం, సిపిఐ ఎంఎల్ వినోద్ మిశ్రా సంఘం ఆధ్వర్యం లో బుధవారం లింగంపర్తిలో ఘనంగా సన్మానించారు. ఆ సంఘం ఆర్గనైజింగ్ కార్యదర్శి కోసి రెడ్డి గణేష్ మాట్లాడుతూ భూస్వాములు దళారులు చేతుల్లో ఎన్నో ఏళ్లుగా ఆక్ర మణలకు గురైన వంద లాది ఎకరాలు భూములు పేదలకు అందేలా హైకో ర్టులో పోరాడి ఆర్డర్లు తెచ్చిన మహోన్నత వ్యక్తి చలపతి అని కొనియాడారు. మండల సీపీఎం కార్యదర్శి పాకలపాటి సోమరాజు మాట్లాడుతూ ఫీజులు కోసం కాకుండా న్యాయం కోసం పనిచేస్తున్న అతి తక్కువ మంది న్యాయవాదుల్లో చలపతి ఒక్కరని అన్నారు. గిరిజన సంఘం రాష్ట్ర నాయకులు రెడ్డి ఆనంద పాల్, మహిళా నాయకురాలు గండేటి నాగమణి, జై భీమ్ పార్టీ జిల్లా అధ్యక్షుడు దాడిశెట్టి వీరబాబు, ప్రముఖ న్యాయవాది గండేటి కిషోర్ కుమార్ పలు ప్రజా సంఘాల నాయకులు కార్యకర్తలు ఉన్నారు.

రైతు బిడ్డగా ఏరువాక పౌర్ణమి చేస్తున్న 'ఎమ్మెల్యే'

విశాలాంధ్ర-సీతానగరం/ రాజానగరం: ఒక రైతు బిడ్డగా ఏరువాక పౌర్ణమి నిర్వహిస్తున్న అని రాజా నగరం నియోజకవర్గ ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ అన్నారు. రాజానగరం నియోజకవర్గంలో కోరుకొండ మండలం గాదాల గ్రామంలో బుధ వారం రైతులతో కలిసి ఏరువాక పౌర్ణమి వేడుకలు నిర్వహించారు. దీనిలో భాగంగా ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ నాగలి చేతబట్టి పొలం దున్ని విత్త నాలు జల్లి అందరిని ఆశ్చర్యపరిచారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ మాట్లాడుతూ రైతులతో కలిసి ఏరువాక పౌర్ణమి కార్యక్రమం చేయడం అదృష్టంగా భావిస్తున్నాను అని, ఒక రైతు బిడ్డగా ఏరువాక పౌర్ణమి కార్యక్రమంలో పాల్గొనే అవకాశం నాకు కల్పించిన ప్రభుత్వానికి ముఖ్యంగా రాజానగరం నియోజకవర్గం ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు. గత ప్రభుత్వం సుమారు రూ.1573 కోట్లు ధాన్యం డబ్బులు బకాయి పెట్టి వెళ్ళిపోతే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ధాన్యం బకాయిలు విడుదల చేసి రైతుల మోహంలో ఆనందాన్ని చూసామని అన్నారు. రైతుని ఒక ఎంటర్ప్రూనేర్‌గా మార్చాలన్నదే కూటమి ప్రభుత్వ లక్ష్యంగా రాబోయే నాలుగు సంవత్సరా లలో పక్కా ప్రణాళికలతో రైతును అభివృద్ధి చేస్తామని అన్నారు.ఈ ఏరువాకలో కార్యక్రమానికి ఒక ఎమ్మెల్యే గా కాకుండా ఒక రైతు బిడ్డగా పాల్గొనడం జరిగింద న్నారు. కార్యక్రమంలో ఏ డి మల్లికార్జున రావు, కూటమి పార్టీల నాయకులు, కార్యకర్తలు, రైతులు, వ్యవసాయ శాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

కొత్త మూలపేటలో కార్డెన్ సెర్చ్

విశాలాంధ్ర - యు కొత్తపల్లి : మండలం, కొత్త మూలపేటలో సీఐ శ్రీనివాస్ ఆధ్వర్యంలో కార్డెన్‌సెర్చ్ నిర్వహించి బుధవారం అనుమాని తులను తనిఖీ చేసి వారి వద్ద నుండి సరైన పత్రాలు లేని సుమారు 48 ద్విచక్ర వాహనాలను, 2ఆటోలనుసీజ్ చేశారు. 20 లీటర్ల నాటుసారా సీజ్ చేసి కేసు నమోదు చేశారు. కార్డెన్ సెర్చ్ అనంతరం సీఐ మాట్లాడుతూ కొత్త వ్యక్తులు/అనుమానితులు కనిపించిన, ఏదైనా అసాంఘిక చర్యలు జరిగిన వెనువెంటనే ఉప్పాడ కొత్తపల్లి పోలీస్ స్టేషన్ వారికి సమాచారం అందించాలని, అదేవిధంగా అక్కడ నివాసం ఉండే ఇంటి యజమా నులు, కొత్త వ్యక్తులకు ఎవరికైనా ఇల్లు అద్దెకిచ్చేటప్పుడు వారి యొక్క వివరాలను పూర్తిగా తెలుసుకోవాలని సూచించారు.

ఎస్సై బాధ్యతలు స్వీకరణ

పెదపూడి ఎస్సైగా తులసిరామ్

విశాలాంధ్ర-పెదపూడి : పెదపూడి సబ్‌ఇన్స్పెక్టర్ ఆఫ్ పోలీసుగా ఎస్ తులసి రామ్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఆయన ఇంతవరకు కాకినాడ టూ టౌన్ ఎస్ఐగా పనిచేసి ఇక్కడకు బదిలీ అయ్యారు. ఇంతవరకు ఇక్కడ ఎస్సైగా పనిచేసిన కె రామారావు పశ్చిమగోదావరిజిల్లా భీమవరం బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా తులసిరామ్ మాట్లాడుతూ మండలంలో శాంతి భద్రతల పరిరక్షణకు ప్రజలు సహకరించాలన్నారు.

వ్యవసాయ పనులకు ఎమ్మెల్యే శ్రీకారం

విశాలాంధ్ర-పెదపూడి : సమృద్ధిగా వర్షాలు కురిసి పంటలు బాగా పండి రైతులందరికీ సమృద్ధి, శ్రేయస్సు కలగాలని ఎమ్మెల్యే నల్ల మిల్లి రామకృష్ణారెడ్డి ఆకాంక్షించారు. బుధవారం బిక్కవోలు మండలం తొస్సిపూడిలో ఏరువాక పౌర్ణమి సందర్భంగా ఎమ్మెల్యే నల్ల మిల్లి రామకృష్ణారెడ్డి ప్రత్యేక పూజలు నిర్వహించి, పొలం దున్ని వ్యవసాయ పనులు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కూటమి నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సంక్షేమం, అభివృద్ధే కూటమి ప్రభుత్వ ధ్యేయం

విశాలాంధ్ర - అనపర్తి : సంక్షేమం, అభివృద్ధే కూటమి ప్రభుత్వ ధ్యేయ మని ఏడాది పాలనలో కోట్లాది రూపాయలతో నియోజకవర్గంలో అనేక అభివృద్ధి పనులు చేపట్టడం జరిగిందని ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి అన్నారు. బుధవారం పెదపర్తిలో రూ.39.15 లక్షల వ్యయ ంతో నిర్మించిన నాలుగు సీసీ రోడ్లు ఎమ్మెల్యే నల్లమిల్లి ప్రారంభించారు. బిక్క వోలు మండలం కొమరిపాలెం లో రూ.17.50 లక్షలతో నిర్మించిన రెండు సిసి రోడ్లు,పెదపూడి మండలం గొల్లల మామిడాడలో రూ.66 లక్షలతో నిర్మి ంచే ఏడు సీసీ రోడ్లు ఎమ్మెల్యే నల్లమిల్లి ప్రారంభించారు. రాజుపాలెంలో రూ. 20 లక్షల వ్యయంతో నిర్మించే ఏడు సీసీ రోడ్లకు, పైనలో 23 లక్షలతో నిర్మిం చే మూడు సిసి రోడ్ల నిర్మాణానికి ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి శంకు స్థాపన చేశారు. కార్యక్రమంలో మండల టిడిపి అధ్యక్షులు కొవ్వూరి శ్రీని వాస రెడ్డి (దత్తుడు శ్రీను), ఎంపీడీవో ఎం రామకృష్ణారెడ్డి, కర్రి వెంకట రామారెడ్డి, కర్రి శేషారత్నం, ఇంకా పలువురు ఎన్ డి ఏ నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఇండస్ట్రీలో అగ్ని ప్రమాదం

- షార్ట్ సర్క్యూట్ కారణం అంటున్న ఫ్యాక్టరీ యాజమాన్యం
- 50 లక్షలకు పైగానే నష్టం

విశాలాంధ్ర - తాళ్లపూడి : తాళ్లపూడి మండలం అన్నదేవరపేట రెవిన్యూ పరిధిలో గల తరుణి ఇండస్ట్రీస్‌లో అగ్నిప్రమాదం చోటు చేసుకుంది. మంగళవారం రాత్రి సమయం లో జరిగిన ఈ ప్రమాదానికి విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణం అని సమాచారం. ఫ్యాక్టరీ గోడౌన్‌లో బేరియం క్లోరైడ్ స్టాక్ ఉంటుం దని అగ్ని ప్రమాదం వల్ల మరింత ఎక్కువగా మంటలు ఎగిసాయి. ప్రాణ నష్టం జరగలేదు కానీ దగ్గరలో ఉన్న జగనన్న కాలనీ వాసులు మంటలు చూసి ఆందోళన చెందారు. జిల్లా ఫైర్ ఆఫీసర్ మార్టిన్ లూథర్ సంఘటన ప్రదేశానికి వచ్చారు. కొవ్వూరు నుండి ఫైర్ ఇంజన్ వచ్చి మంటలను అదుపు చేశారు. తాళ్లపూడి ఎస్సై రామకృష్ణ, విఆర్వో నాగేశ్వర రావులు ప్రదేశానికి వచ్చారు. అగ్ని ప్రమాదానికి గురైన ఆస్తి రూ.50 లక్షల వరకు ఉంటుందని అధికారులు ప్రాథమిక అంచనా వేస్తున్నారు.

డ్రైన్లలో పూడికతీత : సర్పంచ్

విశాలాంధ్ర-కడియం : కడియం మండలం, దుళ్ళ గ్రామంలో ప్రధాన డ్రైన్ నందు పూడిక తీయిస్తున్నట్లు ఆ గ్రామ సర్పంచ్ కొండపల్లి పట్టియ్య తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దుళ్ళ గ్రామానికి సంబంధిం చిన చాలా డ్రైన్లు, ఎస్సీ పేట ప్రధాన డ్రైన్ ద్వారా ప్రవహించి, మురికి కాల్వల్లో కలుస్తాయని, ఈ డ్రైన్లో పూడిక తీయించి చాలా కాల మైందని, రానున్న వర్షాకాలాన్ని దృష్టిలో పెట్టుకొని, ఈ పెద్ద డ్రైన్ పూడిక తీయిస్తున్నామని తెలిపారు. అలాగే వంతెన వద్ద డ్రైన్ పూడిక తీయించడం జరిగిందని, వర్షాకాలం వస్తున్న తరుణంలో అన్ని డ్రైన్లు సిల్టు తీస్తామని తెలిపారు.

భీమేశ్వర స్వామి ఆలయ పునఃనిర్మాణం

విశాలాంధ్ర - పెదపూడి, అనపర్తి : గొల్లల మామిడాడ శ్రీ భ్రమరాంబిక సమేత భీమేశ్వరస్వామి ఆలయ పునః నిర్మాణం జరిగిన సందర్భంగా ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి ఆలయాన్ని ప్రారంభించారు. బుధవారం ఆలయ వ్యవస్థాపక అధ్యక్షులు డివిఆర్‌ఎ పాపిరెడ్డి ఆధ్వర్యంలో ఎమ్మెల్యే నల్లమిల్లి స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా పాపిరెడ్డి ఆధ్వర్యంలో ఎమ్మెల్యే రామకృష్ణారెడ్డిని సన్మానించి మెమెంటో అందజేశారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు జుత్తుక కృష్ణ సూర్య కుమారి, శివరామ కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఏలేశ్వరంలో ముద్రగడ పర్యటన

విశాలాంధ్ర-ఏలేశ్వరం : మండలంలో నియోజక వర్గ వైసిపి కోఆర్డినేటర్ ముద్రగడ గిరిబాబు పర్యటించి పలు కుటుంబాలను పరామర్శించి ఓదార్చారు. ఏలేశ్వరం మండలం జె అన్నవరం గ్రామంలో పర్యటించి ముద్రగడ గిరిబాబు వైసీపీ నాయకులు కార్యకర్తలను కలిశారు. గిరిబాబు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం వచ్చి ఏడాది పాలన అంతా ప్రచారానికి పరిమితం అయిందని చేసింది ఏమీ లేదని ప్రభుత్వం చేసిన మోసాలను ప్రజల్లోకి తీసుకువెళ్లి కూటమి ప్రభుత్వా నికి బుద్ధి చెప్పాలన్నారు. ఎన్నికల్లో సూపర్ సిక్స్ హామీలు అమలు చేస్తామని ప్రచారం చేసి అధికారంలోకి వచ్చాక సూపర్ సిక్స్ పథకాలు అమలు చేయలేక కూటమి ప్రభుత్వం చేతులెత్తేసిందన్నారు. వైసీపీ

నాయకులు శిడగం వెంకటేశ్వరరావు, బదిరెడ్డి గోవింద్, గొల్లపల్లి సురేష్, జువ్విన వీర్రాజు, వెంకటరమణ, వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

రోడ్లకు ఎమ్మెల్యే శంకుస్థాపనలు

విశాలాంధ్ర - ఏలేశ్వరం : ప్రత్తిపాడు శాసన సభ్యురాలు వరుపుల సత్యప్రభ బుధవారం ఏలేశ్వరం మండలంలో నూతనంగా నిర్మించిన రోడ్లతో పాటు పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు నిర్వహించారు. ఎంతో కాలంగా ఎదురుచూస్తున్న కొండ తిమ్మాపురం గిరిజన గ్రామం రోడ్డుకు మూడు కోట్ల రూపాయలతో ఆమె శంకుస్థాపన చేశారు. ఏలేశ్వరం ఆర్ అండ్ బి రోడ్డు నుండి తిరుమాలి గ్రామానికి రూ.70 లక్షలతో, సిరిపురంలో రూ.7 లక్షలతో, భద్రవరంలో రూ.5లక్షల నిధులతో నిర్మించనున్న రోడ్లకు, ఎర్రవరంలో రూ.20 లక్షల రూపాయల నిధులతో చేపట్టనున్న అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే శంకుస్థాపనలు చేశారు. లింగంపర్తి, సిరిపురం గ్రామాలలో రూ.4.6 లక్షలతో నిర్మించిన గోశాలలను ఆమెట కూటమి శ్రేణులతో కలిసి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు మేడిశెట్టి బాబి, జ్యోతుల పెదబాబు, వివిఎస్ఎన్ రాజేష్, అలమండ చలమయ్య, సింగిలిదేవి సత్తిరాజు, సూతి బూరయ్య, చిక్కాల లక్ష్మణరావు, పెంటకోట మోహన్, ఎంపీడీవో కేవి సూర్యనారాయణ, జెఈ మురళీకృష్ణ, ఏపీవో బి సత్యనారాయణ ఉన్నారు.

ఏరువాక పౌర్ణమి నాగలి పట్టిన ఎమ్మెల్యే సత్య ప్రభ

విశాలాంధ్ర - ప్రత్తిపాడు : మండలంలోని రాచపల్లిలో గ్రామంలో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఏరువాక పౌర్ణమి సందర్భంగా వ్యవసాయ క్షేత్రంలో ప్రత్తిపాడు ఎమ్మెల్యే వరుపుల సత్య ప్రభ విత్తనాలు చల్లి, నాగలి చేత పట్టి పొలం దున్ని ఏరువాక పౌర్ణమి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జిల్లా వ్యవసాయ అధికారి విజయ్ కుమార్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఈ ఏడాది వర్షాలు సమృద్ధిగా ఉన్నాయని రైతులు పంటలు పండించి మంచి దిగుబడి సాధించాలని ఆమె కోరారు. రైతులందరూ సుఖసంతోషాలతో ఉండాలన్నారు. వ్యవసాయ క్షేత్రంలో వ్యవసాయ అధికారులు ఏర్పాటు చేసిన విత్తనాలు ప్యాకెట్లను రైతులకు పంపిణీ చేశారు. అలాగే ధర్మవరంలో 36 లక్షల రూపాయలతో నిర్మించిన అంగన్వాడీ కేంద్రాలను కాకినాడ ఎంపీ తంగెళ్ల ఉదయ శ్రీనివాస్, ఎమ్మెల్యే సత్య ప్రభ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ 10 కోట్ల రూపాయలతో నియోజకవర్గ వ్యాప్తంగా వివిధ రకాల అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశామన్నారు. నియోజకవర్గంలో ప్రజల పడుతున్న కష్టాలు తెలుసుకొని సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో ఏవో వైవి గంగాధర్, కూటమి నాయకులు కొమ్ముల కన్నబాబు, యాళ్ల జగదీష్, వత్సవాయి సూర్యనారాయణ రాజు (మీసాల రాజు), మేడిశెట్టి సూర్య కిరణ్(బాబి), సింగిలి దేవి సత్తిరాజు, ఎస్ సీతబాబు, ఏ వెంకట్రావు, ఇల్లా అప్పారావు, గొర్లి నాగేశ్వరావు తదితరులు పాల్గొన్నారు.

ఫాదర్ జాన్ పీటర్ జన్మదిన వేడుకలు

విశాలాంధ్ర-దేవరపల్లి: దేవరపల్లి మండలం గౌరీపట్నం నిర్మలగిరి మేరీ మాత పుణ్యక్షేత్రం డైరెక్టర్ ఫాదర్ జాన్ పీటర్ జన్మదిన వేడుకలు పుణ్యక్షేత్రం ఆవరణలో జరిగింది ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎస్సీ కమిషన్ చైర్మన్ కె ఎస్ జోహార్ మాట్లాడుతూ దేవుని సేవలో నిర్మలగిరి ఫాదర్ జాన్ పీటర్ నిర్మలగిరి పుణ్యక్షేత్రానికి చేస్తున్న సేవలను ఎస్సీ కమిషన్ చైర్మన్ కేఎస్ జవహర్ కొనియాడారు. ఈ సందర్భంగా ఫాదర్ జాన్ పీటర్కు ఎస్సీ కమిషన్ చైర్మన్ కేఎస్ జవహర్ ఆయన సతీమణి ఫాదర్ ఆరోను శుభాకాంక్షలు తెలియజేసి సత్కరించారు. ఈ కార్యక్రమంలో కొవ్వూరు ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు నిర్మలగిరి పుణ్యక్షేత్రం నిత్య అన్నదానం కాంట్రాక్టర్ కళ్ళే నాగేశ్వరరావు టీడీపీ సీనియర్ నాయకుడు కొయ్యలమూడి చిన్నబాబు మాజీ జెడ్పిటిసి కోయిలమూడి సుధారాణి మాజీ వైస్ ఎంపీపీ బొదంపూడి ఇందిరా ఫాదర్ జాన్ పీటర్ అభిమానులు పుణ్య క్షేత్రం ఫాదర్లు సిస్టర్లు గౌరీపట్నం పరిసర గ్రామాల నుండి అధిక సంఖ్యలో భక్తులు తరలి వచ్చారు. ఫాదర్కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం పుణ్యక్షేత్ర డైరెక్టర్ జాన్ పీటర్ కట్ చేసి అందజేసి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. నిర్మలగిరి సేవకులు బొట్టు శివ కందుకూరి శ్యామ్ దుర్గారావు అనిల్ మోషే తదితరులు పాల్గొన్నారు.

దేశానికే రైతు వెన్నెముక : ఎమ్మెల్యే మద్దిపాటి

విశాలాంధ్ర - గోపాలపురం : దేశానికే రైతు వెన్నెముక అని ఎమ్మెల్యే మద్దిపాటి వెంకటరాజు తెలిపారు. బుధవారం మండలంలోని జగన్నాథపురం గ్రామంలో ఏరువాక పౌర్ణమి కార్యక్రమాన్ని ఎమ్మెల్యే లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఏరువాక సాగు ఎడ్ల బండి పై వెళ్లి దుక్కి దున్ని ప్రారంభించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో రైతులను ఉద్దేశించి మాట్లాడుతూ సాంకేతిక పరిజ్ఞానం అందుబాటు లోకి వచ్చిన నేటి కాలంలో వ్యవసాయానికి ప్రాధాన్యత తగ్గించి నేటితరం ఉద్యోగాల వేటలో ముందుకు కొనసాగుతున్నారని ఇది దేశానికి క్షేమం కాదని అన్నారు. లక్ష కంప్యూటర్లు ఒకచోట చేర్చిన ఒక్క బియ్యపు గింజ కూడా అవి తయారు చేయలేవని గుర్తు చేశారు. గత ప్రభుత్వం రైతుల నడ్డి విరిచి సబ్సిడీలు రద్దుచేసి రైతు పండించిన ధాన్యాన్ని సైతం కొనుగోలు చేసి డబ్బులు చెల్లించలేని దౌర్భాగ్య స్థితిలో రైతాంగాన్ని ఇబ్బందులకు గురిచేసిం దన్నారు. చంద్రబాబు నాయుడు హయాంలో కూటమి ప్రభుత్వం ఈ ఏడాది సుమారు నాలుగు లక్షల క్వింటాళ్ల ధాన్యాన్ని నియోజకవర్గ పరిధిలో కొనుగోలు చేసి రైతు ఖాతాలో 24 గంటల్లోపే నగదు జమ చేయడం జరిగిందన్నారు. 80 శాతం సబ్సిడీతో ఖరీఫ్ సీజన్ మరియు ఇతర వ్యవసాయ ఉత్పత్తుల సాగు కోసం డ్రోన్ల సహకారంతో రైతులు వ్యవసాయం చేసుకు నేందుకు ప్రభుత్వం అందిస్తుందని తెలిపారు. యాంత్రికరణను అందిపుచ్చుకొని తక్కువ ఖర్చుతో అధిక దిగుబడులు సాధించుకోవచ్చని తెలిపారు. నియోజకవర్గ పరిధిలో 6 గురు కి ఐసిడిఎస్ ప్రాజెక్టులో ఉద్యోగాలకు ఎంపికైన వారికి నియా మక పత్రాలు అందిం చారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాఖ జాయింట్ డైరెక్టర్ మాధవ రావు, మండల పార్టీ అధ్యక్ష కార్యదర్శులు రొంగల సత్య నారాయణ, వడ్లమూడి రమేష్, తెదేపా మండల యువత అధ్యక్షుడు కాట్రగడ్డ సురేష్, గ్రామ కమిటీ అధ్యక్షుడు పసుమర్తి గంగాధర్, పసుమర్తి సత్య నారాయణ (అబ్బులు) మహిళా సమాఖ్య అధ్యక్షు రాలు కాకర్ల రామ తులసి, కొర్లపాటి రాము, ఆసు పత్రి అభివృద్ధి కమిటీ చైర్మన్ పడమటి శ్రీనివాస రావు, జేష్ట శ్రీనివాసరావు, నాలుగు మండలాల వ్యవసాయ అధికారులు రాజారావు. పలు శాఖల అధికారులు వ్యవసాయ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

నేడు పిఠాపురంలో యోగాంధ్ర

కాకినాడ జిల్లా కలెక్టర్ షన్మోహన్ సగిలి

విశాలాంధ్ర - కాకినాడ : పిఠాపురం పాద కార్యాలయం పక్కన ఉన్న మున్సిపల్ హైస్కూల్లో యోగాంధ్ర భారీ కార్యక్రమం నిర్వహణకు ఏర్పాట్లు పూర్తి అయ్యాయి. గురువారం ఉదయం 6.30 గంటలకు ఇక్కడ యోగా ప్రదర్శన ప్రారంభమవుతుంది. యోగాకు విస్తృత ప్రచుర్యం కల్పించే దుకు యోగాంధ్ర కార్యక్రమాల్లో భాగంగా పర్యాటక ప్రదేశాలు, పుణ్య క్షేత్రాల్లో ప్రదర్శనలు నిర్వహించాలని ప్రభుత్వం ఆదేశించింది. పిఠాపురం పాద కార్యాలయం పక్కన ఉన్న మున్సిపల్ హైస్కూల్లో యోగాంధ్ర 2025 భారీ కార్యక్రమం ఈ ప్రదర్శన నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమంకు ఎటువంటి ఇబ్బంది రాకుండా పగడ్బందీగా ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ షన్మోహన్ సగిలి ఆదేశించారు.

దేవరపల్లికి గ్రామానికి నిధులు మంజూరు

విశాలాంధ్ర-దేవరపల్లి: దేవరపల్లి గ్రామానికి 5 కోట్ల31 లక్ష 49 వేలు మంజూరు చేసిన గోపాలపురం ఎమ్మెల్యే మద్దిపాటి వెంకటరాజుకు కృతజ్ఞతలు తెలియజేస్తూ దేవరపల్లి తెలుగుదేశం జనసేన బిజెపి నేతలు సమావేశం నిర్వహించారు ఈ సమావేశంలో తెలుగుదేశం పార్టీ నేతలు మాట్లాడుతూ అధికారంలోకి వచ్చిన ఒక సంవత్సరంలోనే దేవరపల్లి గ్రామపంచాయతీ అభివృద్ధికి 5 కోట్ల 31 లక్షల 49 వేలు మంజూరు చేసినందుకు ఎమ్మెల్యే మద్యపాటి వెంకటరాజు కృతజ్ఞతలు తెలియజేశారు. గోపాలపురం నియోజకవర్గం ఏర్పడినప్పటి నుండి ఏ ఎమ్మెల్యే కూడా ఒక సంవత్సరంలో చేరినటువంటి కార్యక్రమాలు గోపాలపురం ఎమ్మెల్యే మద్దిపాటి వెంకటరాజు చేసి చూపించారని తెలిపారు.

కాకినాడలో 22న 149వ

జాతీయ శతాధిక కవి సమ్మేళనం బ్రోచర్ ఆవిష్కరణ

విశాలాంధ్ర - కాకినాడ : ఈనెల 22 న కాకినాడలో పిఆర్ కళా శాల ఆడిటోరియంలో అంతర్జాతీయ సాహిత్య సంస్కృతిక సంస్థ శ్రీ శ్రీ కళావేదిక సీఈవో డాక్టర్ కత్తిమండ ప్రతాప్ సారధ్యంలో జరిగే గోదావరి కవితా పండుగ 149వ జాతీయ ద్వి శతాధిక కవి సమ్మే ళనం బ్రోచరును బుధవారం అమలాపురంలో ప్రముఖ విద్యా సంస్థ విద్యా సంస్థల చైర్మన్ ఏబి నాయుడు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జాతీయ స్థాయిలో 148 శతాధిక కవి సమ్మేళనం నిర్వహించిన ఘనత శ్రీ శ్రీ కళావేదిక దక్కుతుందని సాహిత్యానికి నిరంతరం కృషి చేస్తున్న కళారత్న డాక్టర్ కత్తి మండ ప్రతాప్ సేవలను ఆయన కొనియాడారు. డాక్టర్ బిఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా శ్రీ శ్రీ కళా కళావేదిక జిల్లా శాఖ అధ్యక్షులు, ప్రముఖ సాహితీవేత్త, సీనియర్ తెలుగు లెక్చరర్ నల్లా నరసింహమూర్తి ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

మండపేట పోస్ట్ ఆఫీస్‌కు గుర్తింపు తెచ్చిన ఉద్యోగులు

విశాలాంధ్ర-మండపేట : ప్రైవేటు కొరియర్ సర్వీసులు, ఆన్లైన్ సేవలు అందుబాటులోకి రావడంతో గత కొంతకాలం నుండి కేంద్ర ప్రభుత్వ సంస్థ అయిన తపాలా శాఖ తన ఉనికిని కోల్పోతూ వస్తుంది. ఇటువంటి తరుణంలో కేంద్ర ప్రభుత్వం తపాలాశాఖ ఉన్నతాధికారులు పోస్టల్ శాఖ అందించే సేవలను ప్రజలకు మరింత చేరువ చేయాలని ఉద్దేశ తంతో ఇటీవల కాలంలో అనేక పథకా లను ప్రవేశపెట్టి అమలు చేస్తుంది. ప్రజలకు అత్యంత మేలు చేకూరే పథకా లను అమలు చేయడంతో ఈ శాఖ తిరిగి తన ఉనికిని కాపాడు కుంటూ పూర్వపు వైభవాన్ని సంతరి ంచుకుంటుంది. ముఖ్యంగా చిత్తశుద్ధితో పనిచేసే ఉద్యోగులు ఉంటే ఈ శాఖ మరింత ప్రజలలోకి చొచ్చుకుని వెళ్లి ప్రజలకు మేలు చేకూర్చే ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకుని వెళతారు. ఆ విధంగానే మండపేట పోస్ట్ ఆఫీస్‌లో పనిచేస్తున్న ఇరువురు పోస్టల్ అసిస్టెంట్లు అందిస్తున్న సేవలు ఎనలేనివిగా చెప్పుకో వచ్చు. పోస్ట్ ఆఫీస్‌లో పోస్టల్ అసిస్టెంట్ కెవి నారాయణరావు మరో ఉద్యోగి కొండపల్లి సూర్యనారాయణ అందిస్తున్న సేవలు అందరికీ ఆదర్శం కాగలరని చెప్పవచ్చు. కెవి నారాయణరావు(బాబి) గడచిన సంవత్సరం కాలంలో తపాలా శాఖ ద్వారా అమలు చేస్తున్న పథకాలైన పోస్టల్ లైఫ్ ఇన్సూరెన్స్, సుకన్య సమృద్ధి యోజన ,ఇండియా పోస్ట్ పేమెంట్ బ్యాంకు ఖాతాలను అత్యధికంగా తెరిపించి మండపేట సబ్ పోస్ట్ ఆఫీస్‌ను ఉన్నత స్థానంలో చేర్చడంలో ప్రముఖ పాత్ర పోషించారు. అదే రీతిలో కొండపల్లి సూర్యనారాయణ కూడా పోస్టల్ లైఫ్ ఇన్సూరెన్స్, అకౌంట్స్ ఓపెనింగ్ ప్రమాద బీమా పాలసీలు, తదితర పథకాలతో ఇతర సేవలతో తనకు తాను గుర్తింపు తెచ్చుకుంటూ మండపేట పోస్ట్ ఆఫీస్ను ప్రజలకు సేవలు అందించడంలో నెంబర్ వన్ స్థానంలో నిలిపారు అనడంలో ఏమాత్రం సందేహం లేదు. మంగళవారం రామచంద్రపురం వివిఎస్ఎం కళాశాల ఆడిటోరియంలో రామచంద్రపురం సబ్ డివిజన్ సమ్మిట్‌లో వీరి సేవలను అధికారులు గుర్తించి వీరికి సబ్ డివిజన్ స్థాయిలో అవార్డులను అందించి సత్కరించడం జరిగింది. ఇలాగే వీరిని ఆదర్శంగా తీసుకుని పోస్టల్ శాఖలో మిగతా ఉద్యోగులు కూడా పనిచేస్తే రాజమండ్రి పోస్టల్ డివిజన్ దేశంలో మంచి గుర్తింపు లభిస్తుందనములో ఏమాత్రం సందేహం లేదు. కెవి నారాయణరావు (బాబి)కు ఉత్తమ ఉద్యోగిగా అవార్డు లభించడం పట్ల, అదేవిధంగా కొండపల్లి సూర్య నారాయణ, మరియు ఇతర ఉద్యోగులకు అవార్డులు లభించడం పట్ల పట్టణ ప్రజలతోపాటు, తపాలా ఉద్యోగులు, రిటైర్డ్ ఉద్యోగులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

వైసీపీ పరిస్థితి అగమ్య గోచరం!



కొవ్వూరు నియోజకవర్గంలో విభిన్న రాజకీయ పరిస్థితులు... టీడీపీ ఖాతాలోకి కొవ్వూరు మున్సిపాలిటీ?

విశాలాంధ్ర-కొవ్వూరు : కొవ్వూరు నియోజక వర్గంలో నేడు విభిన్న రాజకీయ పరిస్థితులు నెల కొన్నాయి ఎన్నడు లేనివిధంగా పార్టీ పి రాయిం పులు, ఏకగ్రీవాలు, ఆధిపత్య పోరు, వర్గపోరు వంటి పద్ధతుల్లో రాజకీయ నడుస్తుంది ఇటువంటి రాజకీయం చూస్తున్న రాజకీయ విశ్లేషకులు ముక్కున వేలేసుకుని పరిస్థితులు నెలకొన్నాయి వివరాల్లోకి వెళితే.. గత నాలుగు రోజుల క్రితం వైసీపీకు చెందిన మున్సిపల్ చైర్‌పర్సన్ రత్నకుమారి అదేవిధంగా కౌన్సిలర్లు ముగ్గురు వైసీపీకు రాజీ నామా చేసి టీడీపీ పార్టీ పెద్దయిన పెండ్యాల అచ్చి బాబును కలిశారు. దీంతో వారు టిడిపిలో జాయిన్ అవుతారని విషయం స్పష్టమైంది. ఏకగ్రీవాలకు తెరలేపిన మాజీమంత్రి వనిత హయాంలో మున్సి పల్ ఎన్నికల్లో జరిగాయి ఎన్నికలలో టిడిపి వైసీపీల మధ్య పరస్పర అవగాహన కుదిరి వార్డులను ఏకగ్రీ వాళ్ళ పేరట పంచుకున్నాయి అయితే అప్పటికి విడిగా ఉన్న జనసేన యువ నాయకుడు దేగల రాము రాజకీయ కురువృద్ధుడు మాజీ ఎమ్మెల్సీ కోడెల శివరామకృష్ణకు గట్టి పోటీని ఇచ్చాడు. దఅయితే స్వల్ప మెజార్టీతో జనసేన పరాజయం పాలైంది. ఈ నేపథ్యంలో జనసేన తరపున పోటీ చేసే అభ్యర్థికి వైసీపీ అనేక ప్రలోభాలకు గురి చేసిన అతను మాత్రం వెనక్కి తగ్గలేదు. దీంతో ఎ వైసీపీకు 15, టిడిపికు ఏడు బిజెపికి ఒకటి సీట్లు లభించాయి. మెజార్టీ ఉన్న రాజీనామాలు ఎందుకు మున్సిపాలిటీలో వైసీపీకి తగినంత మెజార్టీ ఉం దగా హఠాత్తుగా ఈ రాజీనామాల పర్వం ఏమిట న్నది ప్రశ్నగా మారింది. వైసీపీలో తనకు తగినంత గౌరవం లభించడం లేదని అది కూడా, రాజకీయ కురువృద్ధునిగా పేరున్న మాజీ ఎమ్మెల్సీ ప్రస్తుత కౌన్సిలర్ తమకు తగినంత విలువ ఇవ్వటం లేదని అదే విధంగా మంత్రిగా ఉన్న వనిత సమయంలో కూడా తమకు ఆశించిన గౌరవం దక్క లేదని చైర్ పర్సన్ ముందు నుంచి ముభావంగా ఉంటూ వచ్చారు. సరిగ్గా ఈ సమయంలోనే మున్సిపల్ ఫ్లోర్ లీడర్ చిన్ని, ద్వి కమిటీ సభ్యులు కంఠమణి రామకృష్ణ, జొన్నలగడ్డ చౌదరి రాజకీయ చాణ క్యుడు అర్బన్ బ్యాంక్ అధ్యక్షులు మద్దిపట్ల శివ రామకృష్ణ తదితర నాయకులు ముందుకు వచ్చి చక్రం తిప్పినట్లు సమాచారం. దీని ఫలితంగానే చైర్పర్సన్ వైసీపీకు చేసినట్లు తెలుస్తోంది. పార్టీ మారిన వారు పట్టణ అభివృద్ధి కోసమే తాము రాజీనామా చేశామని చెబుతున్న రాబోయే రోజుల్లో వైసీపీకు భవిష్యత్తు లేదని ముఖ్యంగా కొవ్వూరు నియోజకవర్గంలోను, పట్టణంలోనూ వైసీపీ పరిస్థితి మెరుగుపడే అవకాశంలేదని భావిస్తున్నట్లు తెలు స్తోంది. అసలే కార్యకర్తల బలం అంగ బలం ఆర్థిక బలం ఉన్న తమ కుప్పి గంతులు అవసరమా అని కొంతమంది వైసీపీ నాయకులు భావిస్తున్నట్లు తెలుస్తుంది దీనికి ఉదాహరణగా వైసీపీ నుంచి టీడీపీకి జంప్ అయిన నాయకులు తీరే నిదర్శనం గా నిలుస్తోంది. ఆయన మాటే శాసనం.. ఆయన అనుకుంటే సీటు ఇప్పిస్తారు వద్దనుకుంటే పక్కన ఉంచుతారు. ప్రజలకు ఏమాత్రం అసౌకర్యం కలిగిన ఆయన ఒప్పుకొని మనస్తత్వమే సీఎం చంద్రబాబు మెప్పుకు దారి తీసింది. ఆయన ఎవరో కాదు కొవ్వూరు గోపాలపురం పోలవరం నియోజక వర్గాలకు పెద్దదిక్కుగా ఉన్న మాజీ ఎమ్మెల్యే కృష్ణ బాబు సోదరుడు అచ్చిబాబు. 1983 నుంచి టిడిపి ఆవిర్భావం తర్వాత దొమ్మేరు జమీందారులుగా పేరున్న కృష్ణబాబు అచ్చిబాబులు ఇటు కొవ్వూరుతో పాటు పక్కన ఉన్న గోపాలపురం పోలవరం తణుకు నియోజకవర్గం అభ్యర్థుల దగ్గర నుంచి వారి విజయం వరకు ముందుండి నడిపించేవారు. దీంతో అప్పటి ముఖ్యమంత్రి స్వర్గీయ ఎన్టీ రామా రావుతో పాటు ఇప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబు వరకు ఈ మూడు నియోజకవర్గాల బాధ్యతను ఇప్ప టికీ ఈ కుటుంబం మీద ఉంచారంటే వారి ప్రతి భకు నిదర్శనం. ఈ నేపథ్యంలో ప్రభుత్వం అధికా రులకు వచ్చి ఏడాదికా వస్తుంది. ఈ ఏడాది కాలంలో టీడీపీ పరిస్థితిని ఎప్పటికప్పుడు పర్య వేక్షిస్తూ పార్టీకి పలుచోట్ల ఇస్తూ పార్టీని ముందుకు నడిపిస్తున్నారు. ఈ నేపథ్యంలో వైసీపీ మరింత బలహీనపడి టీడీపీ తన పూర్వస్థితిని మించి ముందుకు వెళుతుందని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. రాజకీయ కురువృద్ధునికి అమా వాస్య గ్రహణం కొవ్వూరు రాజకీయాలలో సీనియర్ నేత అప్పటి స్వర్గీయ ముఖ్యమంత్రి రాజశేఖర్ అను చరుడుగా పేరొందిన కోడూరి శివరామకృష్ణ కాంగ్రెస్ పార్టీ నాయకుడిగా చక్రం తిప్పారు. ఈ నేపథ్యంలోనే మొన్నటి మునిసిపల్ ఎన్నికల్లో తన ప్రధాన అనుచరుడు మాజీ కౌన్సిలర్ భావన రాజేష్ సతీమణి రత్నకుమారి చైర్పర్సన్‌గా ఎన్నికవ్వటానికి తన చతురతను నిరూపించారు. అయితే గురు శిష్యులుగా ఉన్న శివరామకృష్ణ, భావన రాజేష్‌లు మధ్య సంబంధాలు బెడిసి కొట్టడం, ఈ నేపథ్యం లోనే మున్సిపల్ చైర్మన్ రత్నకుమారి రాజీనామా చేశారన్న అభిప్రాయాన్ని వ్యక్తం చేస్తున్నారు. ఇదిలా ఉండగా రానున్న రోజుల్లో మున్సిపాలిటీలో మిగిలి ఉన్న వైసీపీ కౌన్సిలర్లు సైతం టిడిపిలో చేరే అవకాశం ఉందని పలువురు భావిస్తున్నారు.

హౌసింగ్ లే అవుట్‌లలో క్వాలిటీ కంట్రోల్ పనులపై కలెక్టర్ సమీక్ష

విశాలాంధ్ర - తూర్పుగోదావరి : హౌసింగ్ కాలనీలో మౌలిక సదు పాయాలు కల్పనలో చేపట్టే పనుల విషయంలో నాణ్యత ప్రమాణాలను పాటించే పరీక్షల విషయంలో ఖచ్చితత్వం కలిగి ఉండాలని జిల్లా కలెక్టర్ పి. ప్రశాంతి స్పష్టం చేశారు. స్థానిక కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో బుధవారం హౌసింగ్ లే అవుట్ లలో నిర్వహించిన పనులపై హౌసింగ్ పిడి ఎస్ భాస్కర్ రెడ్డిలతో కలిసి క్వాలిటీ కంట్రోల్ అధికారులు, ఇంజనీర్ లతో పనుల పురో గతి పై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ పి ప్రశాంతి మాట్లా డుతూ, రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు గృహ నిర్మాణాల లే అవుట్ లలో మౌలిక సదుపాయాలు కల్పన కోసం ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు తెలి పారు. అందులో భాగంగా లే అవుట్ లలో చేపట్టే పనుల విషయంలో నాణ్యత ప్రమాణాలు కచ్చితంగా పాటించాలి అని పేర్కొన్నారు. ఆయా పనులు పూర్తి చేసిన తర్వాత క్షేత్ర స్థాయిలో తనిఖీలు నిర్వహించి, వాటి వివరాలు తెలియ చేయడం పై ఎటువంటి అవకతవకలకు అవకాశం లేకుండా నివేదిక అంద చేయాలని పేర్కొన్నారు. జిల్లాలో 326 హౌసింగ్ లే అవుట్ లలో చేపట్టిన రహదారుల, ఇతర పనుల్లో 29 పనుల నాణ్యత ప్రమాణాలు పై నివేదిక ఇవ్వడం జరిగిందన్నారు. ఇంకా 297 పనులకి సంబంధించి సమగ్ర నివేదిక అందచేయాల్సి ఉందన్నారు. లే అవుట్ లలో రహ దారుల నిర్మాణం, గ్రౌండ్ లెవెలింగ్, ఇతర పనులకు సంబంధించి నిర్దేశించిన మార్గదర్శకాలను అను సరించి ఆయా పనులు స్థాయి పై ఆధారపడి నివేదిక అందచేయాలని ఆదేశిం చారు. పనుల విషయంలో నాణ్యత ప్రమాణాలు పాటించని వారి విషయంలో ఉపేక్షించే ప్రసక్తి లేదని పేర్కొన్నారు. మీరు అందచేసే నివేదికలు ఆధారంగా చర్యలు తీసుకోవడం జరుగుతుందని వెల్లడించారు.

కమ్యూనిటీ హెల్త్ సెంటర్ ప్రారంభం

ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ, ఎంపీ తంగేళ్ల ఉదయ్ శ్రీనివాస్

విశాలాంధ్ర - గండేపల్లి : కూటమి ప్రభుత్వం సంవత్సర కాలం పూర్తి చేసు కున్న సందర్భంగా జగ్గంపేట కమ్యూనిటీ హెల్త్ సెంటర్ నూతన భవనం రూ.6.50లక్షలతో గండేపల్లి మండలం జెడ్ రాగంపేట గ్రామపంచాయతీ పరిధిలో నిర్మించారు. బుధవారం ముఖ్యమంత్రి చంద్రబాబు అమరావతి నుంచి వర్చువల్‌గా ప్రారంభించగా జగ్గంపేట శాసనసభ్యులుజ్యోతుల నెహ్రూ, కాకినాడ పార్లమెంటు సభ్యులు తంగేళ్ల ఉదయ శ్రీనివాస్ రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. అనంతరం శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. ఈ సంద ర్భంగా వారు మాట్లాడుతూ ప్రజలకు మెరుగైన వైద్యం అందించాలని ప్రభు త్వం అన్ని చర్యలు తీసుకుంటుందని అందులో భాగంగా 30 పడగల కమ్యూ నిటీ హెల్త్ సెంటర్ 6 కోట్ల 50 లక్షలతో అన్ని హంగులతో నిర్మాణం పూర్తి చేసుకుని ప్రారంభించుకున్నామని అన్నారు. ఇక్కడే పోస్టుమార్టం నిర్వహించ దానికి బిల్డింగ్ కూడా నిర్మించుకుందామని అన్నారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ అడపా భరత్‌బాబు, ఆర్యవైశ్య డైరెక్టర్ కొత్తకొండ బాబు, ఏలేరు ప్రాజెక్టు కమిటీ చైర్మన్ బస్వా వీరబాబు, స్పెషల్ ఆఫీసర్ సత్య నారా యణ, డాక్టర్ స్వప్న, ఎంపీపీ తోట రవి, తోట గాంధీ ఎస్వీఎస్ అప్పల రాజు, మారి శెట్టి భద్రం, ఆసుపత్రి అభివృద్ధి కమిటీ డైరెక్టర్ పాండ్రంగి రాంబాబు, డాక్టర్ ప్రణీత్ అధిక సంఖ్యలో కూటమి నాయకులు, ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

ఇంటింటికి తాగునీరు : మంత్రి కందుల

విశాలాంధ్ర-నిడదవోలు : గ్రామాల్లో నీటి ఎద్దడి రాకు ండా ట్యాంకులను నిర్మించి గ్రామంలోని ప్రతి ఇంటికి తాగునీరు అందించడమే ప్రభుత్వ ప్రధాన ధ్యేయమని రాష్ట్ర పర్యాటక సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ మంత్రి కందుల దుర్గేష్ అన్నారు. నిడదవోలు రూరల్ మండలం, కోరుమామిడిలో జల జీవన్ మిషన్ పథకంలో భాగంగా రూ 44.17 లక్షల అంచనా వ్యయం తో ఏర్పాటు చేసిన మంచినీటి ట్యాంక్, పైప్‌లైన్లు కుళాయిలను మంత్రి కందుల దుర్గేష్ ప్రారంభించారు. ఈ సందర్భంగా దుర్గేష్ మాట్లాడుతూ ముందస్తుగా నీటి ఎద్దడిని ఎదుర్కో వడానికి ట్యాంకులను నిర్మించి పైపు లైన్ ద్వారా ఇంటిం టికి నీటిని సరఫరా చేయడం జరుగుతుందన్నారు. ప్రతి ఒక్కరూ నీటిని వృధా చేయకుండా సద్వినియోగం చేసుకో వాలన్నారు. ప్రతి శుక్రవారం ఫ్రైడే డ్రై డే అమలు చేసి నీటిని పొదుపు చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సర్పంచ్ అంబటి గోపమ్మ. ఎంపీటీసీలు కానుబోయిన ప్రభావతి, పరిగేటి సౌజన్య, తదితరులు పాల్గొన్నారు.

అసంపూర్తి పనులకు మోక్షం ఎప్పుడో?

- 10 కి.మీ ప్రయాణానికి రెండు గంటల సమయం

విశాలాంధ్ర - సీతానగరం: అసంపూర్తిగా పనులకు మోక్షం ఎప్పుడో అంటున్న ప్రజలు. మండలంలో ముగ్గళ్ళ గ్రామం నుండి వయా కూనవరం, మునగాల, కాపవరం మీదుగా కోరుకొండ రహదారి నిర్మాణ పనులు గత సంవత్సరం కాలంగా అసంపూర్తిగా మిగిలి పోయాయి. ఈ రోడ్డు నిర్మాణంలో బాగంగా ముగ్గళ్ళ, కూనవరం, మునగాల గ్రామాల్లో సీసీ రోడ్లతో పాటు డ్రైనేజీల నిర్మాణాలు పూర్తి చేశారు. కానీ గ్రామాల సరిహద్దుల నుండి సరిహద్దుల వరకు గల సుమారు 15 కిలో మీటర్ల రహదారి తారు రోడ్డు నిర్మాణ పను లతో పాటు కల్వర్టు నిర్మాణ పనులు ఎక్కడివి అక్కడే నిలిచిపోయి అగమ్య గోచరంగా మారాయి. దీనితో కూనవరం గ్రామ ప్రజలు కోరుకొండ చేరుకోవాలంటే 10 కిలోమీటర్ల ప్రయాణానికి రెండు గంటల సమయం పడుతుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గత వర్షాకాలంలో మునగాల గ్రామం వద్ద గల కల్వర్టు అసంపూర్తిగా నిలిచిపోవడంతో సుమారు రెండు నెలలపాటు కూనవరం ప్రజలు కోరుకొండ చేరుకోవడానికి సుమారు 35 కిలోమీటర్ల ప్రయాణం చేయవలసిన పరిస్థితులు ఏర్ప డ్డాయి. కానీ అప్పటినుండి నేటి వరకు కూడా ఈ కల్వర్టు నిర్మాణం పూర్తి చేయకపోగా మళ్లీ వర్షాకాలం సమీపిస్తుండ డంతో ప్రజలు ఇబ్బందులు పడాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీనికి తోడు కూనవరం గ్రామంలో ప్రైవేటు పాఠశాలల బస్సులు రాకపోకలు సాగించలేమంటూ యజమా నులు తల్లిదండ్రులకు చెపుతున్నారు అంటూ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సాధ్యమై నంత త్వరగా ఈ రోడ్డు నిర్మాణ పను లతో పాటు కల్వర్టుల నిర్మాణం పూర్తి చేయాలని ప్రజలు నాయకులను, అధికారులను కోరుతున్నారు.

ప్రత్తిపాడు శాసన సభ్యురాలు సత్యప్రభకు పబ్బినీడి ఘన సన్మానం

విశాలాంధ్ర - కాకినాడ : ప్రత్తిపాడు శాసన సభ్యు రాలు వరుపుల సత్యప్రభ స్వగ్రామ మైన పెద్ద శంకర్లపూడిలో వారి స్వగృ హంలో ఆంధ్రప్రదేశ్-తెలంగాణ రాష్ట్రాల ఐక్య కాపునాడు వ్యవస్థాపక కన్వీనర్ పబ్బినీడి వెంకటేశ్వరరావు శాలువా, మెమెంటో బహూకరించి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా పబ్బినీడి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ కాపులంతా ఐక్యంగా ఉండాలని, కాపులు అన్ని రంగాలలోను అభివృద్ధి సాధించాలని, రాజ్యాధికార దిశగా పయనించాలని కోరారు. ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రంలో గెలుపొందిన కాపు ఎమ్మె ల్యేలను, ఎంపీలను, ఎమ్మెల్సీలను, వివిధ సంస్థల చైర్మన్‌లను, కాపు ప్రముఖు లను రాజకీయ పార్టీలకు అతీతంగా వారి వద్దకు స్వయంగా వెళ్లి కలిసి సన్మానిస్తున్నట్లు తెలిపారు. నాయకులను సన్మానించ డానికి పెద్ద పెద్ద బహిరంగ సభలు పెట్టి, కాపుల సమయం, సొమ్ములను వృధా చేసే కన్నా ఇలా చేయటం మంచిదని భావించి ఈ విధంగా చేస్తున్నట్లు ఆయన తెలియజేశారు. కార్యక్రమంలో కాపు సంఘాల కో ఆర్డినేటర్ కాపురత్న కెవిఆర్ నాయుడు, కోటిపల్లి రెడ్డి నాయుడు, గురజానపల్లి కొండబాబు, బాబి, రాము పాల్గొన్నారు.